వాయిస్ టుడే
www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com
జనగాత్రం - మననేత్రం
Follow
పేజీలు 8
బుధవారం, జూన్ 28, 2023
HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## టమాటా @ 100

### రైతు బజార్లో కిలో రూ.80..

**హైదరాబాద్, సిటీ, బోయిన్‌పల్లి, జూన్ 26 :** నిగనిగలాడుతున్న టమాటను చూసి ఉండబట్టలేక కొరికేందుకు గబుక్కున చేతుల్లోకి గానీ తీసుకునేరు! కూరగాయలమ్మే అవ్వ కసురుకోగలదు.. ఇంట్లోనైతే ఇల్లాలు కన్నెర్ర చేయనూవచ్చు! ఉప్మా చేసేందుకని పక్కింటోళ్లను చొరవతో రెండు టమాటాలు అడిగేరు.. చురచుర చూడగలరు!! అవును.. టమాటాలు అంత పిరం అయిపోయాయి!! పప్పుల్లో, కూరల్లో తప్పనిసరిగా అవసరమయ్యే టమాటా



# మేం ఎవ్వరికీ ఏ, బీ టీమ్ కాదు!

## కాంగ్రెసేమో బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అంటది.. బీజేపీనేమో కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ ఏ టీమ్ అంటది

'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్'తో కాంగ్రెస్, బీజేపీల్లో హడల్

కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశమంతా ఉచిత విద్యుత్తు

సర్కోలి సభలో సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు

మాది రైతులు, వెనుకబడిన వర్గాలు, అల్ప సంఖ్యాకులు, దళితుల టీమ్

మహారాష్ట్రలోని సర్కోలి బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్





**హైదరాబాద్, జూన్ 27:** 'బీఆర్ఎస్ బీజేపీకి బీ టీమ్ అని కాంగ్రెస్ అంటోంది. కాంగ్రెస్ పార్టీకి బీఆర్ఎస్ ఏ టీమ్ అని బీజేపీ చెబుతోంది. ఈ టీమ్‌లు ఎక్కడి నుంచి వస్తాయో తెల్వదు. మేము ఎవరి టీమూ కాదు. మాది.. రైతులు, వెనుకబడిన వర్గాలు, అల్పసంఖ్యాకులు, దళితుల టీమ్' అని ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ అన్నారు. దేశంలోని రైతులందరికీ బీఆర్ఎసగా ప్రతినిధిగా ఉన్నదని, దేశంలో పరివర్తన కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, దేశాన్ని తప్పకుండా మారుస్తాం అని ప్రకటించారు. తమపార్టీ 'అబ్ కి బార్ కిసాన్ సర్కార్' అనే నినాదంతో ముందుకెళుతోందని... రైతు సంక్షేమ పథకాలు అమలైతే దేశంలోని రైతులంతా బీఆర్ఎస్ వెంట నడుస్తారని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు భయం పట్టుకుందని.. అందుకే బీఆర్ఎసపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా రెండోరోజైన మంగళవారం పండరీపూర్‌లోని విఠలేశ్వర స్వామి, రుక్మిణీదేవీ, తుల్జాపూర్‌లోని తుల్జాభవాని ఆలయాలను కేసీఆర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివంగత భరత్ బాల్కే కుమారుడు స్థానిక ఎన్సీపీ నేత భగీరథ బాల్కే తన అనుచరులతో కలిసి బీఆర్ఎసలో చేరారు. ఆయనకు సీఎం కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా సర్కోలిలో జరిగిన బహిరంగసభలో కేసీఆర్ మాట్లాడారు. మహారాష్ట్రలో వనరులు పుష్కలంగా ఉన్నాయని, ఫలితంగా రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందాల్సిందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే దివాలా తీస్తామని కొందరు అంటున్నారని, కానీ దివాలా తీసేది నేతలు, దివాళీ పండుగ చేసుకొనేది రైతులు అని చెప్పారు. విద్యుదుత్పత్తి రకరకాలుగా జరుగుతున్నా థర్మల్ విద్యుదుత్పత్తే సరైనదని అన్నారు. దేశంలో 150 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఎందుకు వాటిని సరిగా ఉపయోగించుకోకూడదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే కిసాన్ సర్కార్ ఏర్పాటుచేసి, రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్తును అందిస్తామని ప్రకటించారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తెలంగాణలో అమలయ్యే ప్రతి పథకాన్నీ అమలు చేస్తామన్నారు. ఒకవేళ తెలంగాణలో అమలవుతున్న పథకాలను మహారాష్ట్రలో అమలు చేసి ప్రజల జీవితాలను బాగు చేస్తే గనక తాను మళ్లీ ఇక్కడికి రానని.. మధ్యప్రదేశ్ కి వెళ్తానని చెప్పారు కొద్దిరోజుల్లోనే మహారాష్ట్ర మారుతుందని, అక్కడి రైతుల జీవితాలూ మారుతాయి అని పేర్కొన్నారు.

# నన్ను చంపేందుకు కుట్ర

రూ.20 కోట్లు సుపారీ ఇచ్చినట్లు చెబుతున్నారు

నాది బెదిరింపులకు భయపడే జాతి కాదు

పార్టీ మారడం దుస్తులు మార్చుకున్నంత ఈజీ కాదు

పిలిస్తేనే ఢిల్లీ వెళ్లా.. ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదు

బీఆర్ఎసను కొట్టేది బీజేపీయే: ఈటల రాజేందర్

ఈటల హత్యకు సీఎం ప్రోత్సాహంతో కౌశిక్ కుట్ర

హుజూరాబాద్‌లో పిచ్చికుక్కలా అరాచకాలు: జమున



**హైదరాబాద్/మేడ్చల్, జూన్ 27:** తనను హత్య చేసేందుకు కుట్ర జరుగుతోందని బీజేపీ చేరికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. ఇందుకోసం రూ.20 కోట్లు సుపారీ ఇచ్చినట్లు చెబుతున్నారని అన్నారు. జాగ్రత్తగా ఉండాలంటూ కొన్ని నెలలుగా తనను బెదిరిస్తున్నారని, కానీ.. ఇలాంటి బెదిరింపులకు తాను భయపడనని చెప్పారు. తనది భయపడే జాతి కాదని అన్నారు. నయీం లాంటి వాళ్లు చంపడానికి రెక్కీ నిర్వహిస్తేనే భయపడలేదని గుర్తు చేశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేటలోని తన నివాసంలో ఈటల మీడియా సమావేశంలో మాట్లాడారు. తనను చంపేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కుట్ర పన్నారంటూ తన సతీమణి జమున చెప్పిన విషయం వాస్తవమేనన్నారు. ప్రగతిభవన్ స్కెచ్ ప్రకారమే హుజూరాబాద్ నియోజకవర్గంలో అరాచకం సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇక బీజేపీలో తానేమీ అసంతృప్తితో లేనని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించినప్పుడు బీజేపీ అక్కున చేర్చుకుందన్నారు. అయితే తాను పార్టీ వదలివెళ్లాలని కొంతమంది కోరుకున్నారని చెప్పారు. పార్టీ అన్నప్పుడు భేదాభిప్రాయాలు, చిన్న చిన్న సమస్యలు సహజమని అన్నారు. అయినా.. పార్టీ మారడం బట్టలు మార్చినంత ఈజీ కాదని వ్యాఖ్యానించారు. అధిష్ఠానం పిలిస్తేనే ఢిల్లీకి వెళ్లానని, ఎవరిపైనా ఫిర్యాదు చేయలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎసను కొట్టేది బీజేపీయేనని, ఈసారి కేసీఆర్ పార్టీకి డిపాజిట్లు కూడా రావని తేల్చిచెప్పారు. రాష్ట్రంలో బీజేపీ చాపకింద

- మిగతా 2వ పేజీలో



## కాళేశ్వరం ఖర్చు ఏటా 25,109 కోట్లు

విద్యుత్తు బిల్లులకే రూ.11,359 కోట్లు

వార్షిక నిర్వహణకు రూ.272.70 కోట్లు

సేకరించిన రుణాల్లో 1690 కోట్లు మళ్లింపు

ప్రభుత్వం చెప్పినట్టు ఆదాయం లేదు

కాగ్ ప్రాథమిక నివేదికలో వెల్లడి

**హైదరాబాద్, జూన్ 27:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు నిర్వహణ భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) తేల్చింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో నడిస్తే విద్యుత్ బిల్లుల ఖర్చే ఏటా రూ.11,359 కోట్లు కానుందని పేర్కొంది. ఈ బిల్లులు, రుణాల చెల్లింపులన్నీ(2039-40లో రుణ చెల్లింపులన్నీ పూర్తి అవుతాయి) కలుపుకుని ఏటా రూ.25,109 కోట్లు వ్యయం కానుందని కాగ్ లెక్కకట్టింది. అంతేకాక, ప్రాజెక్టు వార్షిక నిర్వహణకు రూ.272.70 కోట్లు అవసరమని చెప్పింది. ఈ మేరకు 2022-23 ఆర్థిక

2లో

## హత్యా రాజకీయాలు చేసేది ఈటలే..

నన్నేం చేస్తారోనని భయపడుతున్నా: కౌశిక్

ఈటల దంపతుల ఆరోపణలు అబద్ధాలు

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కౌశిక్ రెడ్డి



**హైదరాబాద్, జూన్ 27:** ఈటల రాజేందర్ హత్యకు రూ.20కోట్లు సుపారీ ఇచ్చి కుట్ర చేస్తున్నట్టు తనపై వచ్చిన ఆరోపణలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఖండించారు. ఈటల దంపతులు తనపై చేసిన ఆ ఆరోపణలు అబద్ధమని స్పష్టం చేశారు. ఈటల రాజేం దర్‌కే హత్యా రాజకీయాలు అలవాటని

2లో

## అదానీ బాగుపడాలంటే మోదీకి ఓటెయ్యాలి!

### 15 మందిలో ఆయనే అసమర్థ ప్రధాని.. మోదీ విమర్శ మా ప్రాబల్యాన్ని చాటుతోంది

రాహుల్ పోటీగా ఉంటేనే మోదీకి లాభం

ఈటలకు ముప్పుంటే నేను అండగా ఉంటా

సోనియా, రాహుల్ జోలికి మోదీ వెళ్లరు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, జూన్ 27:** దేశ ప్రజల సంక్షేమం ప్రధాని మోదీకి ఏ మాత్రం పట్టదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్ కూతురు బాగుపడాలంటే ఆయనకు ఓటెయ్యాలంటూ ప్రధాని మోదీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో కౌంటర్‌గా కేటీఆర్ ఒక మీడియా చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రత్యర్థి పార్టీలపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అదానీ బాగు పడాలంటేనే మోదీకి ఓటెయ్యాలని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. మోదీ కన్నా మన్మోహన్, పీవీలే ఉత్తమ ప్రధానులన్నారు. దేశాన్ని పాలించిన 15 మంది ప్రధానుల్లో మోదీయే అత్యంత అసమర్థుడని చెప్పారు. తాము ఏ రాజకీయ పార్టీకీ తొత్తులం కాదన్నారు. ఎవరికీ బీ టీమ్ కాదని, రాష్ట్రంలో ఉన్న బీదా బిక్కి టీమ్.. అని వ్యాఖ్యానించారు. మధ్యప్రదేశ్‌లో కూడా మోదీ తమ పేరు తీసి మాట్లాడుతున్నారంటే ఆ రాష్ట్రం వరకు తమ ప్రాబల్యం పెరగడం వల్లేనని కేటీఆర్ అన్నారు. మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా, లేకి విమర్శలు, తప్పుడు మాటలతో పొద్దు పుచ్చుతున్నారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో కేసీఆర్ కుటుంబం గురించి మాట్లాడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. మహారాష్ట్ర, ఒడిసా, మధ్యప్రదేశ్, చత్తీసగఢ్ రాష్ట్రాల్లో మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు బీఆర్ఎసలో చేరుతుండటం వల్లే మధ్యప్రదేశ్ బీజేపీ సభలో బీఆర్ఎస్, కేసీఆర్ కుటుంబం ప్రస్తావన వచ్చిందన్నారు.

***రాహుల్ ఉంటేనే.. మోదీకి లాభం***

దేశ రాజకీయాలు తమ చుట్టే తిరగాలని కాంగ్రెస్, బీజేపీలు కోరుకుంటాయని,

## మీ ఓటు బీఆర్ఎస్‌కా.. బీజేపీకా?

### కేసీఆర్ బిడ్డ బాగు కోసమే అయితే బీఆర్ఎస్‌కి.. మీ బిడ్డల సంక్షేమం కోసమైతే బీజేపీ

- అవినీతి, లక్షల కోట్ల కుంభకోణాలకే ప్రతిపక్షాల గ్యారంటీ..
- పట్నా భేటీలో చేతులు కలిపినవారంతా అవినీతి నేతలే
- వారందరి కుంభకోణాల విలువ కనీసం 20లక్షల కోట్లు..
- విపక్షాల స్కాములపై తీర్పులు ఇవ్వలేక కోర్టులకే అలుపు

*"కేసీఆర్ బిడ్డ బాగు కోసమే అయితే.. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయండి. మీ పిల్లలు, మనవలు, తదుపరి తరాల సంక్షేమం కోసమైతే బీజేపీకి ఓటు వేయండి" అని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ సీఎం కేసీఆర్ పేరు ప్రస్తావించి మరీ ఆయన కుమార్తె కవిత అవినీతిపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు....*



*"మీరు గాంధీ కుటుంబ అభివృద్ధిని కోరుకుంటే కాంగ్రెసకు ఓటేయండి. ములాయం కుమారుడి సంక్షేమం కోరుకుంటే సమాజ్‌వాదీపార్టీకి.. లాలూ సంతానం సంక్షేమాన్ని కోరుకుంటే ఆర్జేడీకి.. శరద్‌పవార్ కుమార్తె బాగు కోరుకుంటే ఎన్సీపీకి.. అబ్దుల్లా కుటుంబ సంక్షేమం కోరుకుంటే నేషనల్ కాన్ఫరెన్స్‌కు.. కరుణానిధి కుటుంబ మేలు కోరుకుంటే డీఎంకేకి.. కేసీఆర్ బిడ్డ బాగు కోరుకుంటే బీఆర్ఎసకు ఓటేయండి. దేశ ప్రజలారా నా మాట వినండి. మీ పిల్లలు, మనవలు, మునిమనవల సంక్షేమాన్ని కాంక్షిస్తే మాత్రం బీజేపీకి ఓటేయండి"*

- 2వ పేజీలో

# వచ్చే నెల్లోనే టికెట్లు!

మెజారిటీ స్థానాలకు అభ్యర్థుల ప్రకటన.. సర్వేల ఆధారంగా గెలిచే వారికే చాన్స్

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు తగిన ప్రాధాన్యం.. పది రోజుల్లో ఎన్నికల కమిటీ ఏర్పాటు చేస్తాం

తప్పుడు హామీలు వద్దు.. చేయగలిగేవే చెప్పండి.. రాష్ట్ర బడ్జెట్ ఆధారంగానే మేనిఫెస్టో

బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు.. జాతీయ స్థాయి కూటమిలోనూ కలుపుకోబోం

రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు ఖర్గే, రాహుల్ స్పష్టీకరణ.. క్రమశిక్షణ తప్పితే వేటు తప్పదు: రాహుల్

బీజేపీతో కలిసి కాంగ్రెస్‌కు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న కేసీఆర్: ఖర్గే



*తెలంగాణలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే నెలలోనే మెజారిటీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ తెలిపారు....*

**న్యూఢిల్లీ/హైదరాబాద్, జూన్ 27:** తెలంగాణలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు వచ్చే నెలలోనే మెజారిటీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీ తెలిపారు. గెలిచే వారికే టికెట్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన కమిటీలను పది రోజుల్లో ప్రకటిస్తామన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఖర్గే నేతృత్వంలో ఢిల్లీలో ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్నికలకు వెళ్లేందుకు ప్రణాళిక, పార్టీ నిర్మాణం, ఎన్నికల్లో దృష్టి సారించాల్సిన అంశాలు, మేనిఫెస్టో రూపకల్పన, వివిధ వర్గాలకు ప్రాధాన్యం, బీఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక పాలనను ఎండగట్టడం, టికెట్ల పంపిణీ వంటి అనేక అంశాలపై దాదాపు రెండున్నర గంటలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుల సలహాలు, సూచనలను అధిష్ఠానం స్వీకరించింది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ తెలంగాణలో బీఆర్ఎసతో ఎటువంటి పొత్తు ఉండబోదని పునరుద్ఘాటించారు. ఇటీవల పట్నాలో జరిగిన ప్రతిపక్ష కూటమి సమావేశానికి బీఆర్ఎసను ఆహ్వానించలేదని గుర్తు చేశారు. ఇకపై కూడా జాతీయ స్థాయిలో ప్రతిపక్షాల కూటమిలో ఆ పార్టీకి భాగస్వామ్యం కల్పించబోమని తేల్చిచెప్పారు.

బీఆర్ఎస్, బీజేపీ కలిసే పనిచేస్తున్నాయని, ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా సీఎం కేసీఆర్ అవినీతిని ప్రజాక్షేత్రంలో ఎండగట్టాలన్నారు. తెలంగాణలోనూ కర్ణాటక ఎన్నికల తరహా వ్యూహాన్నే అమలు చేస్తామని రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. టికెట్లు ఇవ్వడమనేది ఒక్కరి చేతిలో ఉండబోదని, సర్వేల ఆధారంగా గెలిచే అభ్యర్థులను నిర్ణయిస్తామని తెలిపారు. ఓబీసీలు, ఎంబీసీలు, ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. అంతర్గత విభేదాలను పక్కనపెట్టి ఐకమత్యంగా పనిచేయాలన్నారు. చిన్న చిన్న విభేదాలను కూడా పెద్దవిగా చేయడం మానుకోవాలని, రాష్ట్రంలో నాయకులు ఎవరేం చేస్తుంటారో తనకు అన్నీ తెలుసునని చెప్పారు.

అంతర్గత వ్యవహారాలు, విభేదాల గురించి బాహాటంగా మాట్లాడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కర్ణాటక ఎన్నికల సందర్భంగానూ క్రమశిక్షణ తప్పితే ఎంతటి నాయకునిపై అయినా క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నామని, అక్కడ ఆ పరిస్థితి ఎవరూ రానివ్వలేదని తెలిపారు. తెలంగాణలోనూ అలాంటి పరిస్థితి రానివ్వవద్దని అన్నారు. పార్టీ అన్న తర్వాత అభిప్రాయ భేదాలు వస్తుంటాయని, అందరినీ కలుపుకొనిపోవాలని నాయకత్వానికి సూచించారు. కొత్తగా చేరుతున్న నేతలదే పైచేయి అయ్యే అవకాశం ఉందన్న ప్రస్తావన రాగా.. సీనియర్ నేతలు పార్టీకి అందించిన సేవలు తమ దృష్టిలో ఉన్నాయని, అందరికీ న్యాయం చేస్తామని రాహుల్ చెప్పారు. పార్టీ అధికారంలోకి రావడం ప్రధానమని, చిన్ని చిన్న సర్దుబాట్లు తప్పవని

- మిగతా 2వ పేజీలో

## కాళేశ్వరం ఖర్చు ఏటా 25,109 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరానికి సంబంధించి కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆడిట్ చేసిన కాగ్ ప్రాథమిక నివేదికను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. ఈ నివేదికపై అభ్యంతరాలు, అభిప్రాయాలు, సూచనలు ఉంటే తెలియజేయాలని కోరింది. అయితే, కాగ్‌కు వివరాలు అందించడానికి రాష్ట్ర అధికారులు రెండు వారాలుగా మల్లగుల్లాలు పడుతున్నారు. కాగా, కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో ఒక ఎకరం సాగుకు పెట్టుబడి వ్యయం రూ.6.42 లక్షలు కానుందని కాగ్ తన నివేదికలో పేర్కొంది. ఈ ప్రాజెక్టును 56 పనులుగా విభజించగా ఇప్పటిదాకా 12 మాత్రమే పూర్తి అయ్యాయని తెలిపింది. 40 పనులు 3 శాతం నుంచి 99 శాతం దాకా వివిధ దశల్లో ఉండగా, మరో నాలుగు పనులు ఇంకా మొదలవ్వలేదని గుర్తించింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం 98,110 ఎకరాలు అవసరం కాగా ఇప్పటివరకు 63,972 ఎకరాలు సేకరించారని, ప్రాజెక్టుకు రూ.4011 కోట్ల మార్జిన్ మనీ సమకూర్చాల్సిన ప్రభుత్వం ఇప్పటిదాకా ఏమీ ఇవ్వలేదని తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణం కోసం వివిధ ఆర్థిక సంస్థలు/బ్యాంకుల నుంచి సేకరించిన రుణాల్లో రూ.1690 కోట్లను ఇతర అవసరాలకు మళ్లించడాన్ని కాగ్ తప్పుపట్టింది. ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం రూ.1,51,168 కోట్లకు చేరనుందని అంచనా వేసింది. ప్రాజెక్టు నిర్మాణంతో వివిధ రూపాల్లో ఆదాయం వస్తుందని ప్రభుత్వం చెప్పినప్పటికీ వాస్తవ పరిస్థితులు మరోలా ఉన్నాయని, ఆదాయం సమకూరడం లేదని కాగ్ తేల్చింది. ప్రాజెక్టు రీడిజైనింగ్ వల్ల నిర్మాణ అంచనా వ్యయం భారీగా పెరిగిందని ఆక్షేపించింది. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణంతో రూ.63,352 కోట్లకు పూర్తి కావాల్సిన ప్రాజెక్టును కాళేశ్వరం ఎత్తిపోతల పథకంగా మార్చడం ద్వారా రూ.1,02,268 కోట్లకు చేర్చారని పేర్కొంది.

### వడ్డీలు రూ.71,575 కోట్లు !

కాళేశ్వరం ప్రాజెక్టు కింద ప్రభుత్వం రూ.97,449 కోట్లు రుణాలు తీసుకోగా వాటిని తీర్చడానికి అయ్యే వడ్డీ రూ.71,575 కోట్లు కానుంది. 2021-22లో వడ్డీ కింద రూ.143.74 కోట్లు, అసలు రూ.69 కోట్లు కలిపి రూ.213.44 కోట్లు కట్టారు. 2022-23లో వడ్డీ రూ.3375.83 కోట్లు అవ్వగా అసలు రూ.1890.95 కోట్లతో కలిపి మొత్తం రూ.5266.78 కోట్లు కట్టాల్సి ఉంది. ఇక, 2023-24లో ఏకంగా రూ.10859.76 కోట్లు కిస్తీ కింద కట్టాలి.

# వచ్చే నెల్లోనే టికెట్లు!



(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. అమలు చేయగలిగే హామీలనే ఎన్నికల్లో ఇవ్వాలని, అందుకు తగినట్లుగానే మేనిఫెస్టోను రూపొందించాలని మల్లికార్జున ఖర్గే సూచించారు. తప్పుడు హామీలు వద్దే వద్దని స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా హామీలు ఇవ్వాలని, మేనిఫెస్టో రూపకల్పన త్వరగా పూర్తి చేయాలని అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో కర్ణాటకలోని తన సొంత జిల్లాలో తన ఓటమికి కారణమైన వారికి కూడా టికెట్లు ఇచ్చామని తెలిపారు. విభేదాలు ఉన్నాయన్న కారణంతో టికెట్లు ఇవ్వనివ్వకుండా ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు. బీజేపీతో కలిసి కేసీఆర్ దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఖర్గే ఆరోపించారు. షోలాపూర్ పర్యటనకు వెళ్లిన కేసీఆర్.. మహారాష్ట్రలో కాంగ్రెస్ బలంగా ఉన్న ఎస్సీ నియోజకవర్గాల మీదుగానే ప్రయాణం చేశారని పేర్కొన్నారు. వాస్తవానికి పార్టీలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఈ సమావేశంలో ప్రస్తావించాలని పలువురు నాయకులు భావించారు. అయితే సమావేశం ప్రారంభంలోనే ఈ సమావేశం.. ఎన్నికల స్ట్రాటజీకే పరిమితమైందని, ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకోవద్దని ఖర్గే స్పష్టం చేశారు. సమావేశంలో కేసీ వేణుగోపాల్, మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితోపాటు జగ్గారెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, జీవన్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, దామోదర్ రాజనర్సింహ, రేణుకాచౌదరి, బలరాం నాయక్, జానారెడ్డి, షబ్బీర్ అలీ, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, వి.హనుమంతరావు పాల్గొన్నారు.

### కలిసికట్టుగా.. ఇంటింటికీ కాంగ్రెస్: ఠాక్రే

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేస్తారని, ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత చేసే పనుల గురించి వివరిస్తారని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే తెలిపారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పట్ల విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని, కాంగ్రెస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని నమ్ముతున్నారని అన్నారు. తెలంగాణలో వంద శాతం కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ, మహారాష్ట్రతో పాటు వివిధ రాష్ట్రాల్లో బీజేపీ, బీఆర్‌ఎస్ కలిసి పనిచేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీకి మద్దతు పెంచడానికి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని చెప్పారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కర్ణాటకలో మాదిరిగా పదునైన కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్తామని, ఆ రాష్ట్రంలో పాటించిన కొన్ని మౌలిక సూత్రాలను తెలంగాణలో పాటిస్తామని తెలిపారు. కాగా, బీసీలకు పార్టీ ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా తాను కోరానని వి.హనుమంతరావు చెప్పారు. కుటుంబ పాలన కావాలంటే బీఆర్‌ఎస‌కు ఓటేయాలి.. ప్రజాపాలన కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలన్న నినాదంతో ముందుకెళ్లబోతున్నట్లు మధుయాష్కిగౌడ్ ప్రకటించారు.

### జగ్గారెడ్డికి రాహుల్ బుజ్జగింపు

సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డిని రాహుల్‌గాంధీ బుజ్జగించారు. రాహుల్.. సోనియాగాంధీ నివాసానికి జగ్గారెడ్డిని వెంటబెట్టుకొని వెళ్లారు. జగ్గారెడ్డి భుజంపై చేయి వేసి కొంతదూరం నడిచారు. అనంతరం కేసీ వేణుగోపాల్‌తో కలిసి జగ్గారెడ్డి బయటకు వచ్చారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలపై ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని ఆదేశించారని, అందుకే మీడియాకు ఎలాంటి వివరాలు చెప్పబోనని అన్నారు. అంతకుముందు మధ్యాహ్నం జగ్గారెడ్డి విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీలో తనపై దుష్ప్రచారం జరుగుతోందని వాపోయారు. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. కానీ, రాహుల్ బుజ్జగింపుతో సీన్ మారిపోయింది.

### కాంగ్రెసలోకి ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్!

నిజామాబాద్, జూన్ 27 : ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత, నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గ నాయకుడు ముత్యాల సునీల్ రెడ్డి కాంగ్రెస్‌లో పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. సోమవారం ఢిల్లీకి వెళ్లిన ఆయన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నాయకులను కలిసి చర్చలు జరిపారు. కాంగ్రెస్‌లో చేరేందుకు తన సమ్మతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు బీఆర్‌ఎస్ పార్టీలో ఉన్న ఆయన.. 2014 ఎన్నికలకు ముందు బీజేపీలో చేరి బాల్కొండ టికెట్ కోసం ప్రయత్నించారు. అయితే ఆ సీటు పొత్తులో భాగంగా టీడీపీకి వెళ్లింది. 2018 ఎన్నికల్లో బీఎస్పీ టికెట్‌పై పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత బీఎస్పీకి రాజీనామా చేసిన ఆయన ప్రస్తుత పరిణామాల దృష్ట్యా కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయం తీసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

### మోదీ పక్కనే అవినీతిపరులు : వేణుగోపాల్

కాంగ్రెస్ ప్రజాస్వామ్య పార్టీ అని, కొన్ని విభేధాలున్నా ఎన్నికల సమయంలో కర్ణాటక మాదిరిగా తెలంగాణలో కూడా ఐకమత్యంతో పని చేసి విజయం సాధిస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అన్నారు. బీఆర్‌ఎసపై, కేసీఆర్‌పై భోపాల్‌లో ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ.. “60రోజులుగా మణిపూర్ మండిపోతోంది. మోదీ అక్కడి ప్రజలకు కనీసం శాంతి సందేశం కూడా ఇవ్వలేదు. అక్కడకి వెళ్లలేదు. ఆల్ పార్టీ మీటింగ్ కూడా పిలవలేదు. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తూ ప్రజల దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారు. అవినీతి పరులు మాతో లేరు. వారంతా మోదీ పక్కనే ఉన్నారు” అని అన్నారు.

# మీ ఓటు బీఆర్‌ఎస్‌కా.. బీజేపీకా?

*అవినీతి నేతలందరూ పట్నా సమావేశంలో చేతులు కలిపారు. తమ కుంభకోణాలపై జరుగుతున్న దాడి నుంచి తప్పించుకోవడానికి.. పరస్పరం కాపాడుకోవడానికి అవినీతి నేతలు ప్రయత్నిస్తున్నారు. కానీ, నేను మీకు హామీ ఇస్తున్నాను. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టను.*
*-ప్రధాని నరేంద్ర మోదీ*



**న్యూఢిల్లీ, జూన్ 27:** “కేసీఆర్ బిడ్డ బాగు కోసమే అయితే.. బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేయండి. మీ పిల్లలు, మనవలు, తదుపరి తరాల సంక్షేమం కోసమైతే బీజేపీకి ఓటు వేయండి” అని ప్రధాని మోదీ ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ సీఎం కేసీఆర్ పేరు ప్రస్తావించి మరీ ఆయన కుమార్తె కవిత అవినీతిపై పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇటీవల పట్నాలో జరిగిన ప్రతిపక్షాల సమావేశంలో పాల్గొన్న పార్టీలన్నీ కలిపి చేసిన కుంభకోణాల విలువ కనీసం రూ.20 లక్షల కోట్లు ఉంటుందని నిప్పులు చెరిగారు. ఆ సమావేశాన్ని కేవలం ఫొటోల కోసం జరిగిన భేటీగా ఎద్దేవా చేసిన ప్రధాని.. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలే ప్రసక్తి లేదని హెచ్చరించారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగానే విపక్షాలు ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. ఈ ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల నేపథ్యంలో మంగళవారం భోపాల్‌లో నిర్వహించిన ‘మేరా బూత్ సబ్‌సే మజ్‌బూత్’ కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కూడా బీజేపీనే విజయం సాధిస్తుందన్న విశ్వాసం వ్యక్తం చేసిన మోదీ.. విపక్షాలన్నీ కుంభకోణాలకు గ్యారెంటీ ఇస్తాయనే విషయాన్ని ప్రజలందరికీ చెప్పాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపైనా ఉందన్నారు. పట్నాలో జరిగిన విపక్షాల సమావేశం గురించి ప్రస్తావిస్తూ.. “ఆ భేటీకి హాజరైన పార్టీల చరిత్ర చూస్తే, ఆ ఫొటోలో కనపడినవారందరూ కలిసి రూ.20 లక్షల కోట్ల కుంభకోణాలకు గ్యారంటీగా పాల్పడ్డారు. రూ.1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణం, రూ.1.74 లక్షల కోట్ల 2జీ కుంభకోణం, రూ.70 వేల కోట్ల విలువైన కామన్వెల్త్ క్రీడల కుంభకోణం, రూ.10 వేల కోట్ల విలువైన ఉపాధి హామీ కుంభకోణం.. హెలికాప్టర్ల నుంచి జలాంతర్గాముల దాకా కాంగ్రెస్ అవినీతి ‘హస్తం’ చేరుకోని చోటు లేదు. అలాగే.. దాణా కుంభకోణం, రోజ్‌వ్యాలీ కుంభకోణం, శారదా కుంభకోణం, మహారాష్ట్ర సహకార బ్యాంకుల కుంభకోణం, అక్రమ మైనింగ్ కుంభకోణం.. ఇలా ఆర్జేడీ, డీఎంకే, టీఎంసీ, ఎన్సీపీ తదితర పార్టీలు చేసినట్టుగా ఆరోపణలున్న పలు కుంభకోణాల గురించి కూడా ప్రధాని ప్రస్తావించారు. ఆయా పార్టీల ‘స్కామ్ మీటర్’ ఎప్పటికీ తగ్గదన్నారు. అవినీతికి వ్యతిరేకంగా తాము తీసుకుంటున్న చర్యల నుంచి తప్పించుకోవడమే విపక్షాల కనీస ఉమ్మడి కార్యక్రమం అని ఎత్తిపొడిచారు. “విపక్షాలది కుంభకోణాల గ్యారంటీ అయితే.. ప్రతి కుంభకోణంపై దర్యాప్తునకు నాదీ గ్యారంటీ. పేదలను దోచుకున్న, దేశాన్ని దోపిడి చేసినవారి లెక్క తేలుస్తా” అని హెచ్చరించారు. “విపక్షాల అసహనం చూస్తుంటే 2024 ఎన్నికల్లో ప్రజలు బీజేపీకే మళ్లీ అధికారం కట్టబెట్టాలని నిర్ణయించుకున్నట్టు స్పష్టమవుతోంది” అని మోదీ అన్నారు.

### ముస్లింల్లో పస్మాందాలకు అన్యాయం

ముస్లింలను తప్పుదోవ పట్టించి, రెచ్చగొట్టడానికి విపక్షాలు ఉమ్మడి పౌర స్మృతి అంశాన్ని వాడుకుంటున్నాయని మోదీ ఆరోపించారు. “మీరే చెప్పండి.. ఒక ఇంట్లో ఒకరికి ఒక చట్టం, మరొకరికి మరొక చట్టం ఎలా ఉంటాయి? అలాంటి ద్వంద్వ విధానంతో దేశం మాత్రం ఎలా ముందుకు సాగుతుంది” అని మోదీ వ్యాఖ్యానించారు. “ముసల్మాన్ ముసల్మాన్..అని జపం చేస్తున్నవారే గనుక నిజంగా ముస్లింల ప్రయోజనాల కోసం పనిచేసి ఉంటే ముస్లిం కుటుంబాలు వెనుకబడి ఉండేవి కావు” అని ధ్వజమెత్తారు. ప్రతిపక్షాలు అనుసరిస్తున్న ఓటుబ్యాంకు రాజకీయాల కారణంగా.. ముస్లింలలో ‘పస్మాందా’ తెగవారు ఎలాంటి ప్రయోజనాలూ పొందట్లేదని.. వారిని అంటరానివారుగా పరిగణిస్తారని ధ్వజమెత్తారు. ట్రిపుల్ తలాక్‌కు మద్దతిస్తున్నవారు ముస్లిం ఆడబిడ్డలకు ఘోరమైన అన్యాయం చేస్తున్నారని నిప్పులు చెరిగారు. “ఈజిప్టులో ట్రిపుల్ తలాక్‌ను 80-90 సంవత్సరాల క్రితమే రద్దు చేశారు. అది నిజంగా ఇస్లాంలో అంత ముఖ్యమైనదే అయితే.. పాకిస్థాన్, ఖతార్, జోర్డాన్, ఇండోనేషియా తదితర ముస్లిం దేశాల్లో ఎందుకు దాన్ని రద్దు చేశారు?” అని మోదీ ప్రశ్నించారు.

### 5 వందేభారత్ రైళ్లు ప్రారంభం

**భోపాల్, జూన్ 27:** ప్రధాని మోదీ ఒకే రోజు ఐదు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభిం చారు. దేశవ్యాప్తంగా వివిధ మార్గాల్లో వివిధ నగ‍రాలను అనుసంధానించే ఈ రైళ్లకు మంగళవా రమిక్కడ జరిగిన కార్యక్రమంలో పచ్చజెండా ఊపారు. మంగళవారం ఉదయం భోపాల్ విమానాశ్రయంలో దిగిన ప్రధాని రాణి కమలాపతి రైల్వేస్టేషన్‌కు రోడ్డుమార్గంలో చేరుకున్నారు. రాణి కమలాపతి(భోపాల్)-జబల్‌పూర్, ఖజురహో-భోపాల్-ఇండోర్ ఎక్స్‌ప్రెసలను ప్రత్యక్షంగా, మూడింటిని.. మడ్గావ్(గోవా)-ముంబై, ధార్వాడ్-బెంగళూరు, హటియా-రాంచీ(జార?ండ్)-పట్నా రైళ్లను వర్చువల్‌గా ప్రారంభించారు. రైలు బోగీల్లో విద్యార్థులతోనూ ఆయన ముచ్చటించారు.

# నన్ను చంపేందుకు కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

నీరులా విస్తరిస్తోందని, సర్వేలకు అందని ఫలితాలు రాబోతున్నాయని వ్యాఖ్యానించారు.

### కేసీఆర్‌ను ఓడించడమే లక్ష్యం..

పార్టీలో అందరి లక్ష్యం కేసీఆర్‌ను ఓడించడం ఒక్కటేనని ఈటల తెలిపారు. ఇతర రాష్ట్రాలకు వెళ్లి ‘అబ్ కీ బార్ కిసాన్ సర్కార్’ అంటున్న కేసీఆర్.. తెలంగాణలో రైతులు ఆత్మహత్యలు ఎందుకు చేసుకుంటున్నారో, కౌలురైతులకు రైతుబ?ంధు ఎందుకు ఇవ్వడంలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షం ఉండకూడదని అన్ని పార్టీల్లో కేసీఆర్ గందరగోళం సృష్టిస్తున్నారని, కానీ.. కేసీఆర్ పార్టీయే మాయమయ్యే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ఓటమి తప్పదని తేలిపోయిందన్నారు. ముదిరాజ్‌లపై ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం కేసీఆర్ క్షమాపణ చెప్పేవరకూ నిరసనలు కొనసాగిస్తామని ఈటల తేల్చిచెప్పారు. వ్యక్తిగతంగా తన పంచాయితీ అంతా ఒక్క కేసీఆర్‌తోనే తప్ప.. ఆయన కుటుంబసభ్యులతో కాదని చెప్పారు. కేసీఆర్ పార్టీ నుంచి తనను బయటకు పంపించినప్పుడు వారంతా బాధపడి ఉంటారని వ్యాఖ్యానించారు.

### నా భర్త హత్యకు కుట్ర: ఈటల జమున



తన భర్త రాజేందర్‌ను హత్య చేసేందుకు సీఎం కేసీఆర్ ప్రోత్సాహంతో ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి కుట్ర చేస్తున్నారని ఈటల జమున ఆరోపించారు. రూ.20 కోట్లు ఇచ్చి ఈటలను చంపిస్తానంటూ కౌశిక్‌రెడ్డి తన సన్నిహితులతో అన్నట్లు తెలిసిందన్నారు. తన నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై దాడులు చేసిన చరిత్ర కౌశిక్‌రెడ్డిదని, అమరవీరుల స్తూపంపై రాజేందర్ పేరు ఉన్నందునే దానిని కూల్చివేశారని ఆరోపించారు. సీఎం కేసీఆర్‌కు ఈటలపై ఉన్న కోపంతో పిచ్చికుక్క కౌశిక్‌రెడ్డిని హుజూరాబాద్ ప్రజలపై ఉసిగొల్పుతున్నారని జమున తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీంతో కౌశిక్‌రెడ్డి అరాచకాలకు అంతేలేకుండా పోతోందన్నారు. గతంలో వర్నర్‌పైనే అనుచిత వ్యాఖ్యలు చేసినా కౌశిక్‌రెడ్డిని సీఎం కనీసం మందలించలేదని విమర్శించారు. నయీం లాంటి వారికే తాము బెదరలేదని, ఉద్యమ సమయంలో ఎన్నో బెదిరింపులు ఎదుర్కొన్నామని తెలిపారు. బీజేపీలో తాము సంతృప్తికరంగా ఉన్నామని, తమకు పదవుల కన్నా ఆత్మగౌరవం ముఖ్యమని అన్నారు.

### ఈటలకు వై కేటగిరీ భద్రత ప్లస్ సిబ్బంది కేటాయింపు

**హైదరాబాద్, జూన్ 27:** బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు కేంద్ర హోంశాఖ వై కేటగిరీ భద్రత కేటాయించింది. 8 ప్లస్ 8 సిబ్బందితో ఆయనకు భద్రత కల్పించనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న 2 ప్లస్ 2 భద్రతకు ఇది అదనం అని బీజేపీ వర్గాలు తెలిపాయి. తన భర్త హత్యకు సీఎం కేసీఆర్ కుట్ర పన్నారంటూ ఈటల సతీమణి జమున ఆరోపించిన కొద్ది గంటల్లోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# అదానీ బాగుపడాలంటే మోదీకి ఓటెయ్యాలి!

(మొదటి పేజీ తరువాయి)

మరో జాతీయ పార్టీని ముందుకు రానియ్యవని కేటీఆర్ అన్నారు. మోదీకి రాహుల్‌గాంధీ పెద్ద వరమని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ మాట్లాడటం వల్ల ప్రజలు మోదీ వైపు ఆకర్షితులు అవుతున్నారని అన్నారు. రాహుల్ నేతృత్వంలో బలహీన ప్రతిపక్షం ఉండటం వల్ల బీజేపీ ఆడిందిఆటగా మారిందన్నారు. కేసీఆర్ జాతీయంగా రావడాన్ని ఆ రెండు పార్టీలూ భరించలేక పోతున్నాయని చెప్పారు. అణు బాంబు పడ్డ జపాన్ కూడా దూసుకుపోతోందని, భారత్ ఇంకా ఇక్కడే ఉందని, ఈ పరిస్థితికి కాంగ్రెస్, బీజేపీలే ప్రధాన కారణమని కేటీఆర్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఎందుకు బీజేపీని తిట్టడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలపై దర్యాప్తు సంస్థల దాడులు ఎందుకు జరగవని అడిగారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ మీద ఇంతవరకు ఎందుకు ఈడీ విచారణ జరగలేదని ప్రశ్నించారు. తెలంగాణలో మొదటి నుంచీ బీజేపీ లేదన్నారు. “పాలపొంగు లాగా కొన్ని చోట్ల గెలిస్తే అదే బలుపు అనుకుంటున్నారు. బీజేపీ నాయకులు విమర్శిస్తే స్పందించామే తప్ప డిపాజిట్లు కోల్పోయే ఆ పార్టీకి మేం ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వలేదు” అన్నారు.

### ఈటలకు ముప్పుంటే అండగా ఉంటా!

సుపారీలిచ్చి.. హత్యా రాజకీయాలు చేయడం తమకు రాదని కేటీఆర్ అన్నారు. “ఈటల రాజేందర్ నాకు పెద్దన్న.. ఆయనకు ముప్పు ఉందంటే నేను అండగా ఉంటా. అలాంటి పరిస్థితి ఉంటే ఆయనకు భద్రత పెంచేలా చూసే బాధ్యత తీసుకుంటా” అని చెప్పారు.

### ఏపీ ప్రజలు అనుకుంటే ఏమైనా జరగొచ్చు

“పవన్ కళ్యాణ్ నాకు అన్న లాంటి వ్యక్తి.. ఆయన రాజకీయం ఆయనది.. మా రాజకీయం మాది.. లోకేశ్ కూడా ఫ్రెండే.. జగనన్నతో కూడా ఫ్రెండ్‌షిప్ ఉంది. ఏపీలో అసెంబ్లీ మాట అటుంచి.. లోక్‌సభ బరిలో ఉండే పార్టీలన్నీ బీజేపీ పక్షాన్నే ఉన్నాయి. మా లక్ష్యం జాతీయంగా బీఆర్‌ఎసను తీసుకువెళ్లడం. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్నాం. విశాఖ ఉక్కు ఉద్యమానికి బాసటగా నిలుస్తాం. ఏపీ ప్రజలు అనుకుంటే.. ఏమైనా జరగొచ్చు. కేసీఆర్ లాంటి ఫైటర్‌ను ఎక్కడైనా.. ఎప్పుడైనా ఆదరిస్తారు” అని కేటీఆర్ చెప్పారు.

### దుర్గం చిన్నయ్యకు వ్యతిరేకంగా ఆధారాల్లేవు..

ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై వచ్చిన లైంగిక వేధింపులకు ఆధారాల్లేవని కేటీఆర్ అన్నారు. నిజంగా తప్పు చేస్తే అ?ధిష్ఠానం క్షమించదని చెప్పారు. బీఆర్‌ఎస్ పెద్ద కుటుంబమని, తప్పులు చేసిన వారిని మందలించి మార్చుకుంటామని తెలిపారు. పార్టీలో అందరినీ సంతృప్తి పరచలేమని, వెళ్లే వాళ్లు వెళ్లొచ్చని చెప్పారు. ఇతర పార్టీల నుంచి కూడా బీఆర్‌ఎస్ వైపు వస్తున్నారని వెల్లడించారు. ఎవరు ఎక్కడి నుంచి పోటీ చేయాలన్న తుది నిర్ణయం కేసీఆర్‌దేనని, గతంలోలాగే ముందే జాబితా ప్రకటిస్తామని చెప్పారు.

# హత్యా రాజకీయాలు చేసేది ఈటలే..

(మొదటి పేజీ తరువాయి)




అన్నారు. ఈ మేరకు బీఆర్‌ఎసఎల్పీలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈటల రాజేందర్ దంపతులు చేసిన ఆరోపణలు అవాస్తవాలని అన్నారు. ఓటమి భయంతోనే ఆయన హత్యా రాజకీయాలు మాట్లాడుతున్నారని, ఈటల వల్ల ఏం జరుగుతుందోనని తానే భయపడుతున్నానని కౌశిక్ చెప్పారు. తనపై చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ఈటల ప్రస్తుతం ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారో తెలియని అయోమయ స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. బాల్‌రాజ్ అనే వ్యక్తిని హత్య చేయించింది, ఉద్యమకారుడు ప్రవీణ్‌యాదవ్‌ను వేధింపులకు గురి చేసి ఆత్మహత్య చేసుకునేలా చేసింది ఈటలే అని ఆరోపించారు. తాను రాజకీయాల్లోకి వచ్చింది ఈటలను ఓడించడానికే అని చెప్పారు. చిన్న కులాలు అంటూ ఈటల చేసిన వ్యాఖ్యలు బీసీలను అవమానించే విధంగా ఉన్నాయన్నారు. రహదారి విస్తరణ కోసమే హుజూరాబాద్‌లో అమరుల స్థూపాన్ని తొలగించేందుకు మునిసిపాలిటీ తీర్మానం చేసిందని కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

# టమాటా @ 100

(మొదటి పేజీ తరువాయి)

ఇప్పుడు బంగారమైపోయింది. ‘రేట్లతో మండుతున్న మిగతా కూరగాయాలకు నేనేం తక్కువ’ అంటూ వినియోగదారులకు అందకుండా కొండెక్కి కూర్చుంది! కిలోకు రూ.100 నోటు ఇవ్వాల్సిందేనంటోంది. ఐదారురోజుల క్రితం కిలో టమాటా రూ.30-రూ.40గా ఉండగా అలా రోజుకు ఇంత పెరుగుతూ ఏకంగా రూ.100కు చేరింది!! టమాటా ధర సెంచరీకి చేరడంతో వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరి.. టమాటా ధర ఇలా ఒక్కసారిగా పెరగడానికి కారణం అస్థిర వాతావరణ పరిస్థితులేనని నిపుణులు అంటున్నారు! మొన్నటిదాకా తీవ్ర ఎండలు, వడగాలులతో టమాటా సాగు విస్తీర్ణం తగ్గగా.. ఇప్పుడేమో అకాల వర్షాలతో సాగైన కొన్నిచోట్ల కూడా పంటకు తీవ్ర నష్టం జరిగింది. దీంతో కొన్ని రోజుల్లోనే ధర అమాంతంగా పెరిగిపోయింది. రైతుబజార్లో రూ.75-రూ.80 పలుకుతుండగా రోడ్ల పక్కన దుకాణాలు, సూపర్ మార్కెట్లలో, తోపుడు బండ్ల మీద విక్రయించే వారు రూ.100-110కి అమ్ముతున్నారు. మన రాష్ట్రంలోనే కాదు.. దేశంలో చాలాచోట్ల టమాటా ధరలు ఇలానే పెరిగిపోయాయి. బెంగళూరులో కిలో టమాటా రూ.80, లఖ్‌నవూలో రూ.88, భువనేశ్వర్ రూ.99, సిమ్లాలో రూ.100 ధర పలుకుతోంది.

తెలంగాణ వ్యాప్తంగా ప్రతి సీజన్‌లో లక్ష-లక్షన్నర ఎకరాల్లో కూరగాయల పంటలు సాగవుతుంటాయి. ఈ సీజన్‌లో కూరగాయల సాగుకు ఇంకా అనుకూల పరిస్థితులు రాలేదు. ఎండాకాలంలో కూడా చాలా తక్కువ విస్తీర్ణంలో రైతులు కూరగాయలు వేశారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు మించిపోవటంతో విస్తీర్ణం తగ్గించారు. అకాల వర్షాలు, వడగళ్లు కూడా తోడవటంతో కూరగాయల పంటలు బాగా దెబ్బతిన్నాయి. ఫలితంగా మే నెలలో రావాల్సిన టమాటా పంట అప్పటికి చేతికే రాలేదు. జూన్ ఆరంభంలో రుతుపవనాలు వచ్చేసి, తొలకరి వర్షాలు కురిస్తే... రైతులు వెంటనే కూరగాయల సాగు మొదలుపెట్టేవారు. ఈసారి అది జరగకపోవటంతో మార్కెట్లో కూరగాయల కొరత ఏర్పడింది. గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలైన రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్- మల్కాజ్‌గిరి, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో టమాటా సాగు, ఇతర కూరగాయల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి తెలంగాణకు టమాటాల దిగుమతి తగ్గింది. ఏపీలోని చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, కలకడ, పలమనేరు, మహారాష్ట్రలోని సోలాపూర్, లాతూర్, కర్ణాటకలోని గుల్బర్గా, చిక్‌బల్లాపూర్, కోలార్, ఛత్తీస్ గఢ్‌లోని రాయపూర్ నుంచి కూడా టమాటాలు ఆశించిన స్థాయిలో దిగుమతి కావటంలేదు.


# ప్రజా సమస్యలు గాలికికొదిలిన.. ప్రజా ప్రతినిధులు, అధికారులు: రాగిడి లక్ష్మారెడ్డి



ఉప్పల్ జూన్ 27 (వాయిస్ టుడే న్యూస్)మల్లాపూర్ డివిజన్ నెహ్రూ నగర్, అశోక్ నగర్,లో బస్తీ సమస్యలపై విస్తృతంగా పర్యటించిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి సమస్యలు పరిష్కరించడంలో అటు ఉప్పల్ ఎమ్మెల్యే పూర్తిగా వైఫల్యం చెందారని ఆరోపించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నెహ్రూ నగర్ అశోక్ నగర్ లో పర్యటిస్తూ డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని. ఇండ్ల మధ్యల డ్రైనేజీ నీరు పొంగిపొర్లడం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తద్వారా ప్రజలకు డెంగ్యూ, మలేరియా లాంటి ప్రాణాంతకమైన వ్యాధులు ప్రబలుతున్నాయని, చెత్తాచెదారంతో నిండిపోవడం చూసి ఆవేదన వ్యక్తం చేశారు.

రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నెహ్రూ నగర్ అశోక్ నగర్ లలో గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో వేసిన రోడ్లే ఇప్పటివరకు దర్శనమిస్తున్నాయని, బిఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు కార్పొరేటర్గా గెలిచినా ఎటువంటి అభివృద్ధి పనులు ఈ నెహ్రూ నగర్ మరియు అశోక్ నగర్ లో చేపట్టలేదని ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ప్రజలన్నా వారి సమస్యల అన్న స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పట్టించుకోవడంలేదని, పట్టించుకోకపోవడం చాలా దురదృష్టమని రాగిడి లక్ష్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మరి ముఖ్యంగా ఈ నెహ్రూ నగర్ అశోక్ నగర్లలో వృద్ధాప్య పింఛన్లు, వితంతు పింఛన్లు రాక చాలా ఇబ్బందులు పడుతున్న ప్రజలు ఇట్టి సమస్యని పరిష్కరించాలని రాగిడి లక్ష్మారెడ్డి ని కోరడం జరిగింది. వెంటనే స్పందించిన రాగి లక్ష్మారెడ్డి కాప్రా మున్సిపల్ అధికారులతో మాట్లాడి పైన పేర్కొన్న సమస్యలన్నీ వారం రోజుల్లో చేపట్టాలని లేనియెడల పెద్ద ఎత్తున నెహ్రూ నగర్, అశోక్ నగర్ కాలనీవాసులతో కార్పొరేటర్ ఇల్లు, ఎమ్మెల్యే ఇల్లు అలాగే కప్రా మున్సిపల్ ఆఫీస్ ని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు.


ఈ కార్యక్రమంలో టిపిసిసి మైనార్టీస్ జనరల్ సెక్రెటరీ సంజయ్ జైన్, మల్లాపూర్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ వంగేటి సంజీవరెడ్డి, ముసలి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎస్సీ సెల్ అడ్వైజర్ పీజీ సుదర్శన్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డీసీసీ ఓబీసీ ఎక్స్ చైర్మన్ బొంగోని ఉమేష్ గౌడ్, నెమలి అనిల్, బెల్లం గట్టయ్య, స్టార్ రెడ్డి, సేవాదళ్ నాయకులు సద్గుణ రావు, బాలు నాయక్, బాలరాజు, కే రాజేష్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వంజరి సంతోష్, ఉప్పల్ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కప్పర సాయి గౌడ్, వంగేటి బాల్ రెడ్డి, ఎండి రిజ్వాన్, టిల్లు ముదిరాజ్, గుడిసె సాయి గౌడ్, రాంపల్లి సాయి, సేవాలాల్ నాయకులు పసియుద్దీన్, మల్లాపూర్ డివిజన్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ మనోహర్, సీతారాం, కిరణ్, నాగరాజు, ఎం సురేష్, రవికుమార్, రమేష్, అశ్విన్ సింగ్, దిలీప్ శంకర్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా యువజన కాంగ్రెస్ సెక్రెటరీ సాయిబాబా, చందు యాదవ్ ఉప్పల్ డివిజన్ మైనార్టీస్ చైర్మన్ గజ్జల రాజు, సన్నీ గౌడ్, అజయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## పేదలందరికీ నిర్మాణం చేపట్టిన డబల్ బెడ్ రూమ్‌లను ఇవ్వాలని

### ఉప్పల్ ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా

ఉప్పల్,జూన్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి):– ఉప్పల్ సర్కిల్ లో అర్హులైన పేదలందరికీ వెంటనే నిర్మాణం చేపట్టిన డబల్ బెడ్ రూమ్ లను ఇవ్వాలని కోరుతూ తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో ఉప్పల్ ఎంఆర్ఓ ఆఫీస్ నందు ధర్నా నిర్వహించి డిప్యూటీ ఎమ్మార్వో రసీద్దీన్ కి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్ సిఐటియు కార్యదర్శి జే వెంకన్న రజక సంఘం మేడ్చల్ జిల్లా కార్యదర్శి జే ఉపేందర్ సిఐటియు నాయకులు ఎండి గౌస్ లు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పేదలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ హైదరాబాద్ శివారు ప్రాంతాలలో మేడ్చల్ జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా పేదలకు ఇవ్వడానికి ముందుకు రావడం లేదన్నారు. మేడ్చల్ జిల్లాలో నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో 50% జిల్లా వాసులకు ఇవ్వాలని వెంటనే డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారందరికీ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల అట్టి ఇండ్లను పేదలు ఆక్రమించుకుంటారని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై వెంకటేశ్వర్లు భీష్మాచారి వెంకటేష్ యాదగిరి శేఖర్ రజక సంఘం నాయకులు రవి సిఐటియు నాయకులు లక్ష్మణ్ పంతు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. ఈనెల 3 తేదీన జరిగే మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ముట్టడిని ఇల్లు లేని పేదలందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు.



## గ్రామ దేవతలను విగ్రహారాధన పూజించడం తెలంగాణ సంస్కృతిలో భాగం

### టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్

మేడిపల్లి,జూలై 27 (వాయిస్ టుడే ప్రతినిధి):– గ్రామంలో విగ్రహారాధన ద్వారా అమ్మవార్లను ఏర్పాటుచేసి దేవాలయాలను నిర్మించి పూజించడం తెలంగాణ సంస్కృతిలో భాగమని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ బృందావన్ కాలనీలోని పోచమ్మ తల్లి దేవాలయం ఐదవ వార్షికోత్సవ కార్యక్రమానికి గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయ దర్శనం ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ నియోజకవర్గం ఏ బ్లాక్ అధ్యక్షులు సింగరేణి పోచయ్య,మేడ్చల్ మున్సిపాలిటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గం ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పానుగంటి మహేష్, గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు సాయి పేట శ్రీనివాస్,కౌన్సిలర్ చాప రాజు ముదిరాజ్, ప్రేమలత,కుతాడి నర్సింగ్ రావు,రంజిత్ ముదిరాజ్,నర్సింగ్,ఐలేష్,శంకర్,రెగ్గ రాజు యాదవ్ బాలకృష్ణ, గిరి,కుమార్,శ్రీకాంత్, నర్సింగ్, నరేష్, విజయ్, కృష్ణ,బ్రహ్మ,సాయి పాల్గొన్నారు

## ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డిపై డీజీపీకి ఫిర్యాదు చేసిన తెలంగాణ ముదిరాజ్ జేఏసీ



హిమాయత్ నగర్ :– జూన్ 27బీ( వాయిస్ టూడే) ఈ నెల 22 న హుజురాబాద్ లో ముదిరాజ్ కులాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన పాడి కౌశిక్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ముదిరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ డీజీపీ ని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజ్ జాతి ని అవమాన పరచిన కౌశిక్ రెడ్డి ని కఠినంగా శిక్షించాలని డీజీపీ ని కోరామని తెలిపారు.

ఒక కెమెరా జర్నలిస్ట్ ను కులం పేరుతో బూతులు తిట్టి అవమానించారు.. గవర్నర్ కి కూడా కౌశిక్ రెడ్డి పై ఫిర్యాదు చేస్తాం డీజీపీ సానుకూలంగా స్పందించారు. పాడి కౌశిక్ రెడ్డి కి రానున్న ఎన్నికల్లో బుద్ది ముదిరాజులు బుద్ధి చెప్తారు. దీనిపై ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించి కౌశిక్ రెడ్డి ని ఎమ్మెల్సీ పదవి నుండి భర్తరఫ్ చెయ్యాలని తెలంగాణ ముదిరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ పోల్కం లక్ష్మీనారాయణ ముదిరాజ్, జగన్మోహన్ ముదిరాజ్ , పగిడాల సుధాకర్ ముదిరాజ్, గుండు నరసింహ ముదిరాజ్ ,నీరజ ముదిరాజ్ ,లక్ష్మణ్ ముదిరాజ్, మురళీకృష్ణ ముదిరాజ్ కృష్ణ మనోహర్ ముదిరాజ్ డాక్టర్ జగన్మోహన్ ముదిరాజ్ హరికాంత్ ముదిరాజ్ బాలు ముదిరాజ్ హరికాంత్ ముదిరాజ్ స్వర్ణలత ముదిరాజ్ శ్యామల ముదిరాజ్ ,ఝాన్సీ ముదిరాజ్, ,తదితరులు పాల్గొన్నారు.



## పర్వతాపూర్ సీలింగ్ భూమిలో విద్యుత్ మీటర్లు నిలిపివేయండి

### మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్

మేడిపల్లి,జూన్ 26 (వాయిస్ టుడే ప్రతినిధి):– మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మేడిపల్లి మండల సిపిఐ పార్టీ కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో ఎస్.ఈ రాముడు ని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రచ్చ కిషన్ మాట్లాడుతూ పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ సాయి ప్రియా నగర్ సర్వే.నెం1, 9 ,10 సీలింగ్ భూమిలో సర్వే.నెం 5, 8, 9 వేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దీంతో గతంలో ఖాళీగా ఉన్న సీలింగ్ ప్లాట్ లో రాత్రికి రాత్రే చిన్నచిన్న రూములు వేసి అక్రమ నిర్మాణంలో జోరుగా సాగుతున్నాయని,మేడిపల్లి తహసిల్దార్ విద్యుత్ మీటర్లు ఇవ్వరాదని, విద్యుత్ ఏ.ఈ కి రాతపూర్వకంగా ఇచ్చామని, వెంటనే ఇండ్లకు విద్యుత్ మీటర్లు ఇవ్వడం నిలిపివేయాలని, ఇచ్చిన విద్యుత్ మీటర్లను వెంటనే వెనకకు తీసుకోవాలని కోరుతున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి దండు రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి లక్ష రూపాయల చెక్ అందజేత

### – మేయర్ సామల బుచ్చి రెడ్డి

బోడుప్పల్ జూన్ 27 (వాయిస్ టుడే) : బోడుప్పల్ నగర పాలక సంస్థ యందు ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే రాజేష్ యొక్క నాన్నమ్మ కమలమ్మ అనారోగ్యంతో ఆసుపత్రి లో చేరి పెద్ద మొత్తంలో ఖర్చు అవగా ముఖ్యమంత్రి సహాయ నిధికి మేయర్ సామల బుచ్చిరెడ్డి సహకారంతో ధరఖాస్తు చేయగా ఒక లక్ష రూపాయలు మంజూరు కాగా ఈరోజు మేయర్ నివాసంలో ఆ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కాటేపల్లి రామచంద్ర రెడ్డి, చంటి శ్రీనివాస్, మున్సిపల్ సిబ్బంది మహిపాల్, రాజేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## రామ్ బాలాజీ మిఠాయి బందర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్

పీర్జాదిగూడ, జూన్ 27 (వాయిస్ టుడే): ఈరోజు పిర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 5 వ డివిజన్ లో రామ్ బాలాజీ మిఠాయి బంధర్ షాప్ ను ప్రారంభించిన మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, స్థానిక కార్పొరేటర్ బొడిగె స్వాతి కృష్ణ గౌడ్, విజన్ నాయకులు, గ్రామ పెద్దలు పుర ప్రముఖులు, మరియు బి.ఎస్. కే.జీ యువసేన తదితరులు పాల్గొన్నారు.

# అగ్రవర్ణ ఆధిపత్య రాజ్యాధికారం స్థానంలో బహుజన రాజ్యాధికారం సాధించాలి

### బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బిఎల్ఎఫ్) రౌండ్ టేబుల్ సమావేశంలో యంసిపిఐ (యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి




మేడిపల్లి, జూన్ 27 (వాయిస్ టుడే ): తెలంగాణ రాష్ట్రం లో రానున్న ఎన్నికల్లో జనాభా నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ప్రకటించి బిసి ని ముఖ్యమంత్రి చేయాలని యంసిపిఐయు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి తెలంగాణ లో రాజకీయ పార్టీలకు పిలుపు నిచ్చారు . ఇరవై ఏడు తారీఖున రోజున బహుజన లెఫ్ట్ ఫ్రంట్ (బి ఎల్ ఎఫ్ ) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో, రానున్న ఎన్నికల్లో బహుజన వామపక్షాల పాత్ర అనే అంశంపై ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో గాదగోని రవి మాట్లాడుతూ పై విధంగా అన్నారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి బియల్ యప్ చైర్మన్ నల్లా సూర్యప్రకాష్ గారు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా గాదగోని రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో నూటికి 95 శాతం బహుజనులే ఉన్నారు అని 5 శాతం ఉన్న అగ్రవర్ణ ఆదిపత్య దోపిడీ వర్గాలు రాజ్యాధికారం అనుభవిస్తూ రాష్ట్ర సంపదను యదేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు అని అన్నారు. ఇప్పటికీ చట్టసభల్లో కాలుమోపని సామాజిక వర్గాలు ఈ రాష్ట్రంలోనే వందలాది ఉన్నాయి అని అన్నారు. విద్య, వైద్యం, దోపిడీ నిలయాలు గా మార్చారని దీనికి నేతృత్వం వహిస్తున్నది రెండు మూడు సామాజిక వర్గాలే అని ఆ సామాజిక వర్గాలే స్వతంత్రం వచ్చినప్పటి నుంచి దేశాన్ని రాష్ట్రంను పాలిస్తున్నాయి అని వీటి ప్రధాన లక్ష్యం దోపిడీ అసమానతలు దినం దినం అభివృద్ధి చేయటం అని,ఈ దోపిడీ అసమానతలు రూపుమాపేందుకు మెజార్టీ ప్రజలు గా ఉన్న బహుజనులు రాజ్యాధికారం లోకి రావాలి అని దానికి మంచి తరుణం రానున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు అని ఈ ఎన్నికల్లో బహుజన వర్గాలు అన్ని ఏకం కావాలి అని పూలే అంబేద్కర్ మార్క్స్ అందించిన రాజకీయ సిద్ధాంతిక ఆలోచన పునాది పై బహుజన శ్రామిక వర్గాలు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆధ్వర్యంలో ఐక్యం అయి తెలంగాణ లో బహుజన సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ రాజ్యం ఏర్పాటు కోసం తెలంగాణ రాజకీయాల్లో ప్రత్యామ్నాయం కోసం ఈ రౌండ్ టేబుల్ పూనుకోవాలి అని పిలుపు ఇచ్చారు.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మురళీ మనోహర్ , ప్రొఫెసర్ అ తిరుమలి, ప్రొఫెసర్ వీరాస్వామి, బహుజన లెఫ్ట్ ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ వనం సుధాకర్, దండి వెంకట్, పర్వతాలు, బి యల్ యప్ రాష్ట్ర నాయకులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, సిరిగాని సిద్దిరాములు ,వసుకుల మట్టయ్య, పోతుంటాయి కాశీ, పల్లె మురళి,వి , తుకారాం నాయక్, లక్ష్మణ్ భారత ముక్తి పార్టీ, రాయబండి పాండురంగాచారి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నుంచి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## బోరబండలోని భార్యను చంపి పరారైన భర్త



జూబ్లీహిల్స్ జూన్ 27( వాయిస్ టుడే) ఎర్రగడ్డ డివిజన్ సుల్తాన్ నగర్ లోని భార్యపై అనుమానంతో కొన్ని రోజులుగా ఇంటిలో గొడవలు జరుగుతున్నట్లు స్థానికుల సమాచారం పోలీసులు క్లూస్ టీమ్‌తో పాటు సంఘటనా స్థలానికి చేరుకొని ఆధారాలు సేకరించారు. భర్త మిరాజాలి...(40).... భార్య ఫాతిమాను (35)... అనుమానంతో తెల్లవారుజామున రాడుతో తలపై కొట్టడంతో మృతి చెందినది. ఈ దంపతులకు ముగ్గురు మైనర్ పిల్లలు కలరు. వీరు గత తొమ్మిది నెలల క్రితం ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చి ఇక్కడ నివసిస్తున్నారు. మృతురాలు ఫాతిమా అక్క ఫిర్యాది మేరకు మర్డర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న బోరబండ పోలీసులు.

## తెలంగాణ రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఛలో కలెక్టరేట్

కాచిగూడ :– జూన్ 27 బీ ( వాయిస్ టూ డే) 14 లక్షల మంది కాలేజ్ విద్యార్థుల 5 వేల కోట్ల ఫీజుల బకాయిలు విడుదల చేయాలనీ, స్కాలర్ షిప్ లు పెంచాలని డిమాండ్ తో జూలై 1న కలెక్టరేట్, ఆర్ డి ఓ, ఎమ్మార్వో కార్యాలయాలను ముట్టడిస్తామని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అర్. కృష్ణయ్య హెచ్చరించారు. కాచిగూడలో బీసీ విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరల ప్రకారం స్కాలర్షిప్ రెండు రెట్లు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు బడ్జెట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. గత రెండు సంవత్సరాల ఫీజుల బకాయిలను చెల్లించకపోవడంతో కాలేజీ యజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని ఒత్తిడి తెస్తున్నారని క్లాసులో నుండి బయటికి పంపి ఎండలో నిలబెట్టి అవమానపరుస్తున్నారన్నారు. అంతే కాక కోర్స్ పూర్తయిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో పై చదువు లు చదువుకోలేక విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.



## ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలను ఒకేసారి చెల్లించాలి :తపస్

మెదక్: మెదక్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి ఆఫీసులో తెలంగాణా ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ DA బకాయిలను సిపిఎస్ ఉద్యోగులకు 17 విడతలుగా చెల్లింపు ఉత్తర్వులు ఇవ్వడం ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమే అన్నారు. పెండింగ్ పాత పిఆర్సి ఏరియర్స్ 15 వాయిదాలు ఇప్పటికీ చెల్లించలేదు. బిల్లులన్నిటిని వెంటనే చెల్లించాలి మరియు నూతన PRC కమిటీని తక్షణమే నియమించాలని మరియు ఉపాధ్యాయ ఖాళీలను గుర్తించి నూతన DSC నిర్వహించాలని డిమాండ్ చేశారు.పాఠశాలలు ప్రారంభమై 15 రోజులు కావస్తున్నా నేటికి పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందలేదు అన్నారు. పాఠశాలలుకు స్కావెంజర్స్‌ని వెంటనే నియమిచాలి వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా తపస్ జిల్లా, మండల బాధ్యులు తిరునగిరి నర్సింలు, మాధవరెడ్డి, నవీన్ కుమార్, రమేష్, మధు మోహన్, సిద్దు, ఆంజనేయులు, సాయిలు, యాదగిరి, దేవేందర్ రెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా సీనియర్ న్యాయవాది జన్మ దిన వేడుకలు

కరీంనగర్ : కరీంనగర్ బార్ అసోసియేషన్ మాజీ సెక్రెటరీ, సీనియర్ న్యాయవాది కొత్త ప్రకాశ్ జన్మ దిన వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం కరీంనగర్ జిల్లా కోర్టు లోని బార్ అసోసియేషన్ హాల్ లో కొత్త ప్రకాశ్ జన్మ దిన సందర్భంగా కేక్ కట్ చేసి శాలువతో సన్మానించారు. కార్యక్రమం లో బార్ అసోసియేషన్ సెక్రెటరీ సిరికొండ శ్రీధర్ రావు, సీనియర్ న్యాయవాదులు పెంచాల ప్రభాకర్ రావ్, గంజి స్వరాజ్ బాబు, సుదగొని జనార్ధన్ గౌడ్, గుజ్జ సతీశ్, ముత్యాల తిరుపతి రెడ్డి, కటకం శ్రవణ్, సిహెచ్. కిరణ్ కుమార్, దాసం శ్రీధర్, గొనేపెల్లి శ్రీనివాస్ గౌడ్, డి.వి. రమణ, యం. కిషన్ రావు, కొత్తకొండ పర్శారాం, పులి శ్రీధర్, మంద రమేశ్, పులి శ్రీకాంత్ తదితరులు పాల్గొని శుభాకాక్షలు తెలిపారు.ది




## 20వ సారి రక్తదానం చేయటం నా అదృష్టం: సేకు శ్రీనివాసరావు

కోదాడ, జూన్27 (వాయిస్ టుడే) తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఆర్ టి సి డిపోల లో రక్త దాన శిబిరము లు ఏర్పాటు చేయటం అభినందనీయం అని,రక్త దానం అన్ని దానాలలో గొప్పది అని ప్రాణాపాయ స్థితిలో వారికి, గర్భిణీ స్త్రీలకు,ఏక్సిడెంట్ ఐయిన వారికి ఈ రక్తాన్ని ఉపయోగించు కోవచ్చు అని యస్ యస్ రావు అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఈ శిబిరం పేద ప్రజలకు ఉపయోగం అన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి డీ యం సురేందర్,అసిస్టెంట్ డి యం సైదులు,యూనియన్ బ్యాంక్, హెచ్డిఎఫ్సిబ్యాంకు సిబ్బంది, ఆర్ టి సి సిబ్బంది,కూచిపూడి సర్పంచ్ శెట్టి సురేష్,రామకృష్ణ పలువురు పాల్గొన్నారు.



## అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన శశిధర్ రెడ్డి

కోదాడ/చిలుకూరు : జూన్ 27(వాయిస్ టుడే) చిలుకూరు మండలం పాత చిలుకూరు సత్తెమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భారత రాష్ట్ర సమితి కోదాడ నియోజకవర్గం మాజీ ఇంచార్జ్ కన్మంత రెడ్డి శశిధర్ రెడ్డి, అనంతగిరి జెడ్పిటిసి కొనతం ఉమా శ్రీనివాస్ రెడ్డి , చిలుకూరు జడ్పిటిసి బోలిశెట్టి శిరీష నాగేంద్రబాబు , చిలుకూరు ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య , ఎంపీటీసీ కోటయ్య స్థానిక నాయకులు వడ్డేపల్లి కళ్యాణి కోటేష్ , గజ్జి ముత్యాలు అమరవరపు శ్రీను , నరసింహారావు , వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఎంపిక

హుజూర్‌నగర్ జూన్ 27 (వాయిస్ టుడే): హుజూర్‌నగర్ మండలంలోని కరక్కాయలగూడెం గ్రామానికి చెందిన దొంగరి లక్ష్మణ్ స్పోర్ట్ అథారిటీ అఫ్ ఇండియా (SAI) అసిస్టెంట్ డైరెక్టర్ గా ఎంపిక అయినారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాజీ వ్యవసాయ కమిటీ వైస్ చైర్మన్ టీపీసీసీ అధికార ప్రతినిధి అయిన దొంగరి వెంకటేశ్వర్లు చిన్న కుమారుడు. వీరి నియామకం 2021 లో జరిగిన %ఖూరాజ జుఇఝఎ% ద్వారా జరిగినది. దొంగరి లక్ష్మణ్ ఎంపిక పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఎంపీ వద్దిరాజు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు, సహచర ఎంపీలతో కలిసి తులజాపూర్ భవానీ మాత ఆలయ సందర్శన

తుల్జాపూర్: రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు తన్నీరు హరీష్ రావు, ఎర్రబెల్లి దయాకరరావు, గంగుల కమలాకర్, జగదీష్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి,సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి,ఎంపీలు కే.కేశవరావు,నామా నాగేశ్వరరావు, జోగినపల్లి సంతోష్ కుమార్, దీవకొండ దామోదర్ రావు,కే.ఆర్.సురేష్ రెడ్డి, బండి పార్థసారథి రెడ్డి,మాలోతు కవిత, బోర్లకుంట వెంకటేష్ నేతకానిలతో కలిసి సుప్రసిద్ధ తులజాపూర్ భవానీ మాత ఆలయాన్ని సందర్శించారు.దఅమ్మ వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన ముఖ్యమంత్రి కేసీఆర్,ఆయన బృందానికి వేద పండితులు పూర్ణకుంభం, మంగళవాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి కేసీఆర్ భవానీ మాతకు నూతన పట్టువస్త్రాలు సమర్పించారు.ఎంపీ రవిచంద్ర ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు, ఎంపీలు తమ తమ గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా వేద పండితులు కేసీఆర్ కు ఆలయ స్థల పురాణం, విశిష్టతను వివరించారు. కేసీఆర్, మంత్రులు,ఎంపీలకు వేద పండితులు తమ ఆశీర్వచనాలు పలికి, శాలువాలతో సత్కరించారు. అమ్మ వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ను దగ్గర నుంచి చూసేందుకు భక్తులు, స్థానికులు ఆసక్తి చూపుతూ చేతులూపారు, సంతోషం వ్యక్తం చేశారు.కేసీఆర్ వారికి నమస్కరిస్తూ ముందుకు సాగారు.





తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు శ్రీ కేసీఆర్ గారు మహారాష్ట్ర పర్యటనలో భాగంగా పండరీపూర్, తుల్జాపూర్ ఆలయాల సందర్శనానికి వెళ్తున్న ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, సహచర ఎమ్మెల్యేలు మరియు ఎమ్మెల్సీలు,ఇతర ప్రజాప్రతినిధులు.

## శ్రీనివాసపురం గ్రామంలో ఉచిత వైద్య పరీక్షలు

హుజూర్‌నగర్ జూన్ 27 (వాయిస్ టుడే): మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో సిఎస్సి హెల్త్ కేర్ సెంటర్ వారు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.భవన నిర్మాణ కార్మికులు,లేబర్ కార్డు కలిగియున్న ప్రతి ఒక్కరికి శ్రీనివాసపురం గ్రామంలో ఉచితంగా 50 కి పైగా వైద్య . ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రమ్య నాగరాజు గారు మాట్లాడుతూ మన కేసీఆర్ గారు ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలునిర్వహించటం శుభ పరిణామం అన్నారు. మన ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి గారు సహకారంతో శ్రీనివాసపురం గ్రామంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకొని, ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే దానికి తగిన మందులు వాడాలని సూచించారు. కార్మికులు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శ్రవణ్ కుమార్, క్యాంప్ కోఆర్డినేటర్ నజీర్ ఖాన్ మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# విద్యరంగ సమస్య లు పరిష్కరించాలి

## ఏ ఐ ఫ్ డి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున

వరంగల్(వాయిస్ టుడే)విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ రోజు ఉదయం 10 గంటలకు ఏకశిలా పార్కు వద్ద జరిగే నిరాహార దీక్షను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమైక్య తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున పిలుపునిచ్చారు. మంగళవారం నాడు అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్ నిర్వహించిన సమావేశం అయన మాట్లాడుతూ 2009 సంవత్సరంలో తీసుకువచ్చిన విద్యాహక్కు చట్టా%శీ% ప్రకారం కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలో పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఫీజులో 25% ఫీజు రాయితీ ఇవ్వాలని అదేవిధంగా జర్నలిస్టుల పిల్లలకి 50% ఫీజు మాఫీ కల్పించాలని ఎలాంటి అనుమతి లేకుండా అడ్మిషన్ తీసుకొని పాఠశాలలు నడిపిస్తున్నటువంటి పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకొని



వాటిని సీజ్ చేయాలని అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలల్లో బుక్స్ స్టాల్స్ ను నియంత్రించి చర్యలు తీసుకోవాల%అఱ% ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి కనీస అవసరాలు అయినా మరుగుదొడ్లు మంచినీరు బెంచీలు కరెంటు తక్షణమే అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ నాన్ టీచింగ్ మరియు ఎం ఈ ఓ పోస్టులను భర్తీ చేయాలని అయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యారంగ%శీ% అనేక రోజులుగా పెండింగ్ లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం నాడు స్థానిక ఏకశిలా పార్కు వద్ద నిరాహార దీక్ష నిర్వహించడం జరుగుతుందని . ఈదీక్ష కు అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని దీక్ష ను జయప్రదం చేయాలని ఈ సందర్బంగా అయన పిలుపునిచ్చారు

## పెరిగిపోతున్న మూఢనమ్మకాలు!

### ఆందోళనలో ప్రజలు!! ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికార ఘనం!!!

కోదాడ, జూన్ 27(వాయిస్ టుడే) దేశం శాస్త్ర సాంకేతిక రంగంలో ముందుకు పోతున్నప్పటికీ నేటికీ గ్రామీణ ప్రాంతాల్లో మూఢనమ్మకాలకు అనేకమంది బలవుతున్న పరిస్థితులు నేటికీ ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో అమావాస్య ఆదివారం వచ్చిందంటే మూడు బజార్లు, మూడు రోడ్లు కలిసిన చోట నల్లకోడి, నిమ్మకాయలు ,వస్త్రాలు కొబ్బరికాయలతో, తెల్లారేసరికి దర్శనమిస్తున్నాయి. ఈ దృశ్యాలతో చిన్నపిల్లలు భయాందోళనకు గురవుతు న్నా , పరిస్థితులు కోకొల్లలుగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ బాబాలు ,చేతబడులపై నమ్మకం ,పూజారుల తో బాగు చేయించుడు ,కొనసాగుతున్నాయి. మూఢనమ్మకాలకు



కొందరు బలవుతున్న సంబంధిత అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. మూఢనమ్మకాలు తలకెక్కి బాగు చేయించుకునే పేరుతో బాబాలకు లక్షల రూపాయలు తగలబెడుతున్నారు. గతంలో కోదాడ నియోజకవర్గంలో ఓ గ్రామంలో మేకలు కాపరి ఇంట్లో , కొన్ని మేకలు చనిపోవడంతో, గ్రామంలో ఉన్న జంగాల కులముకు చెందిన వారే కారణమని, నమ్మి గోనె సంచిలో ఏసి సాగర్ ఎడమ కాలువలో పడేసిన ఉదాంతం గతంలో జరిగింది. ఓ గ్రామంలో క్యాన్సర్స్ కి మంచం పట్టిన పేషెంట్ కు పందిని కోసి రక్తం అన్నంలో కలిపి తినిపించాడని ప్రచారం జరిగింది. ఇప్పటికైనా జనవిజ్ఞాన వేదిక నాయకులు గ్రామాల్లో పర్యటించి మూఢనమ్మకాల ను పారదోలెందుకు కృషి చేయాలని ప్రజలు ప్రజాతంత్ర వాదులు మేధావులు కోరుతున్నారు.



## విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ

హుజూర్ నగర్ జూన్ 27 (వాయిస్ టుడే): హుజూర్‌నగర్ పట్టణం లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల NSP క్యాంప్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శ్రీ వెంకటేశ్వర ఫౌండేషన్ హుజూర్ నగర్ వారి ఆధ్వర్యం లో ఉచితంగా ? 1లక్ష 20 వేల విలువైన నోట్ పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వర ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రావూరి శివప్రసాద్ మాట్లాడుతూ.... మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు చేపడుతూ ఈ రోజు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమ శిక్షణ తో చదువు కొని ఉన్నత లక్ష్యాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జక్కుల నాగేశ్వరరావు వెంకటేశ్వర ఫౌండేషన్ డైరెక్టర్స్ వేముల నర్సయ్య అద్దంకి పవన్ కుమార్ భువగిరి రమణ పాఠశాలల HM లు మల్లెల ఉదయశ్రీ రాదాదుర్గ ఉపాధ్యాయుల విద్యార్థులు పాల్గొన్నారు.



## నిరుద్యోగులను మోసం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు: రవి

మునగాల 27 జూన్ (వాయిస్ టుడే): నిరుద్యోగుల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యాయని ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) జిల్లా ప్రధాన కార్యదర్శి డి రవి అన్నారు. మండల పరిధిలోని కొక్కిరేణి గ్రామంలో ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) రాష్ట్ర మహాసభ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డి రవి పాల్గొని మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం నేటికీ దాని గురించి మాట్లాడటం శోచనీయంగా ఉందని అన్నారు. అధికారంలోకి రాగానే లక్ష ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పిన కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తుందని అన్నారు. నిరుద్యోగ వ్యతిరేక విధానాల అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు యువకులు తగిన బుద్ధి చెప్పాలని ఈ సందర్భంగా కోరారు. జులై 4, 5 తేదీల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు పట్టణంలో జరుగు పివైఎల్ తెలంగాణ రాష్ట్ర ఎనిమిదో మహాసభలకు యువకులు, నిరుద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పి వై ఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి పున్నం బ్రహ్మం, డివిజన్ నాయకులు చింతకాయల నాగరాజు, బూరుగోమ్ముల అనిల్, ధరావత్ మధు, వెంకటేష్, పచ్చిపాల మధు, వీరేష్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధమిక వ్యవసాయ సహకారసంఘసమావేశం

హుజూర్‌నగర్ జూన్ 27 (వాయిస్ టుడే): పట్టణంలోఈ రోజు కార్యవర్గ సమావేశం లో సంఘ అధ్యక్షులు శ్రీ యరగాని శ్రీనివాస్ గౌడ్ గారి అధక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ రైతులకు స్వల్ప కాలిక ఋణములు (క్రాప్ లోన్), దీర్ఘ కాలిక ఋణముల క్రింద పాడి గేదెలు గొర్రెల పెంపకం, కోళ్ళ పెంపకం (ఫౌల్ట్రి ) ట్రాక్టర్ వరి కోత యంత్రాలు వరి నాటు యంత్రాల రుణాలు ఇవ్వబడును. అన్ని రకముల వరి (జినెక్ష్ చిట్టి పొట్టి )విత్తనములు, జీలుగు విత్తనములు, అన్ని రకముల ఎరువులు, పురుగు మందులు ,పవర్ స్ప్రేయర్లు అందుబాటు ధరలో కలవు కావున సద్వినియోగం చేసుకొనగలరని పేర్కొన్నారు. ఈ సమావేశములో ఉపాధ్యక్షులు శ్రీ కంచెర్ల మధుసూదన్ రెడ్డి గారు, డైరెక్టర్లు శ్రీమతి దేవరం మల్లీశ్వరి గారు, శ్రీమతి కందుల పద్మ గారు, శ్రీ గోసుల శ్రీను గారు, శ్రీ దుగ్గి బ్రహ్మం గారు, శ్రీ జక్కుల నరేందర్ గారు, జక్కుల మల్లమ్మ గారు పాల్గొన్నారు.



# తెలంగాణ సాయుధ పోరాట అమర వీరులను విస్మరించిన మంత్రి గంగుల కమలాకర్

**తెలంగాణ సాయుధ పోరాట అమరుల విగ్రహాల వద్ద మరమ్మత్తులు, సుందరీకరణ చేయించడంలో మంత్రి గంగుల కమలాకర్ విఫలం చెందారు**

**సిపిఐ నగర కార్యదర్శి కశిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజు**




కరీంనగర్, జూన్ 27 (వాయిస్ టుడే): మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావులకు ఇచ్చిన విజ్ఞాపన పత్రాలు పట్టుకొని నిరసన తెలిపిన సిపిఐ నేతలు. సిపిఐ కరీంనగర్ నగరంలోని శాఖ కార్యదర్శిల సమావేశం బద్దం ఎల్లారెడ్డి భవన్లో న్యాలపట్ల రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కశిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజులు మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఏర్పాటుచేసిన సాయుధ పోరాటయోధుడు కమ్యూనిస్టు పార్టీ తొలి జిల్లా కార్యదర్శి అన బేరి ప్రభాకర్ రావు, స్వాతంత్ర సమరయోధుడు కరీంనగర్ తొలి పార్లమెంట్ సభ్యుడు, ఉమ్మడి జిల్లాలో బుగ్గారం ఇందుర్తి శాసనసభ్యులుగా పనిచేసి జిల్లా అభివృద్ధికి అశేష కృషిచేసిన వ్యక్తి బద్దం ఎల్లారెడ్డి విగ్రహాల వద్ద చెత్తాచెదారం ఉన్నదని, విగ్రహాల రంగులు వెలిసిపోతున్నాయని, చుట్టూ ఉన్న చమన్, ఫెన్సింగ్ చెడిపోయిందని రోడ్డు వెడల్పు లో భాగంగా చమన్ కుదించారని గతంలో సిపిఐ ఆధ్వర్యంలో పలుమార్లు మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావులకు విజ్ఞాపన చేసిన నెలలు గడుస్తున్న గాని మరమ్మత్తులకు నోచు కోకపోవడం సిగ్గుచేటని తెలంగాణ పేరిట ఎన్నికల్లో గెలిచిన నాయకులు సాయుధ పోరాట వీరులను విస్మరించడం చూస్తుంటే వీరికి తెలంగాణ కోసం పోరాడిన అమరుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు దశాబ్ది ఉత్సవాలు జరిపి లక్షల రూపాయలు ఖర్చుపెట్టిన పాలకులు తెలంగాణ కోసం ఎదురొడ్డి నిలబడి ప్రాణాలర్పించిన మహనీయులు వారికి గుర్తు లేకపోవడం చూస్తుంటే వారికి తెలంగాణ అమరుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో అర్థమవుతుందన్నారు కరీంనగర్ అన్ని రంగాల్లో అభివృద్ధి పరచామని చెప్పే మంత్రి గంగుల కమలాకర్ కు హైదరాబాదు రోడ్డులో ఉన్న బద్దం ఎల్లారెడ్డి విగ్రహం కనిపించడం లేదా అని వారు ప్రశ్నించారు తన కు ఇష్టమైన వెంకటేశ్వర స్వామి గుడి ముందు ఉన్న అనభేరి విగ్రహం తనకు కనబడడం లేదా అని ఆరోపించారు. గతంలో ముఖ్యమంత్రి సాయుధ పోరాట అమరుల చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేరుస్తానని చెప్పాడని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఎన్నో బహిరంగ సభల్లో బద్దం ఎల్లారెడ్డిని కీర్తించాడని వారి చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలని చెప్పిన వ్యక్తి కెసిఆర్ అని కెసిఆర్ మాటకు కూడా విలువ లేకుండా పోయిందని అమరులను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వెంటనే బద్దం ఎల్లారెడ్డి, అన బేరి ప్రభాకర్ రావు విగ్రహాల వద్ద మరమ్మత్తులు చేసి సుందరీకరణ చేయాలని, చుట్టూ చమన్, గ్రీనరీ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

ఈ కార్యదర్శిల సమావేశం లో న్యాలపట్ల రాజు, కసి బోజుల సంతోష చారి, సత్యనారాయణ చారి, తదితరులు పాల్గొన్నారు.

# 168 సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలి

**కబ్జాలో ఉండి సేద్యం చేసుకుంటున్న పేదలకు పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వాలి**

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



గుండాల (వాయిస్ టుడే) జూన్ 27: గుండాల మండల కేంద్రంలోని సర్వేనెంబర్ 168 లోని 28.23 ఎకరాల భూమిని భూమిలేని పేదలకు పంపిణీ చేయాలని,గత 50 సంవత్సరాలుగా సేద్యం చేసుకుంటున్న నిరుపేదలకు పట్టాదారు పాసు బుక్కులు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని 168 సర్వే నెంబర్లో ఉన్న ప్రభుత్వ భూమిని భూమిలేని నిరుపేదలతో కలిసి పరిశీలన చేసిన అనంతరం ముఖ్య అతిథులుగా పాల్గొన్న నర్సింహ్మా మాట్లాడుతూ అనేక మంది పేదలు, దళితులు సెంటు భూమి లేక రెండు రెక్కలు ఆస్తిగా కాలం ఎల్లతీస్తున్న పరిస్థితి ఉన్నదని వారిని పాలకులు ఆదుకునే పరిస్థితిలో లేరని విమర్శించారు.కెసిఆర్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భూమి లేని దళితులకు,నిరుపేదలకు భూమి పంపిణీ చేస్తామని, కొనిస్తామని చెప్పి ఏ ఒక్కరికి కూడా ఇవ్వలేదని అన్నారు.జిల్లాలో అనేక గ్రామాల్లో ప్రభుత్వ భూములు పెద్ద ఎత్తున ఉన్నాయని వాటన్నింటినీ పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేసినారు.ప్రభుత్వం పెరిగిన ధరలతో కొనిచ్చె పరిస్థితులు లేవని చెబుతున్నప్పుడు ఉన్న ప్రభుత్వ భూములను ఎందుకు పంచడం లేదని ప్రశ్నించారు.పేదలు భూమి అడిగితే లేదని చెబుతున్న ప్రభుత్వం పెద్దలకు,పారిశ్రామికవేత్తలకు ఎందుకు వందలాది ఎకరాల భూమిని కేటాయిస్తున్నారని అన్నారు.ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ భూములు అన్నింటినీ భూమి లేని పేదలకు పంచకపోతే వ్యవసాయ కార్మిక సంఘం జెండాలు పాతి ఆ భూములను పేదలకు పంచుతామని హెచ్చరించినారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి,జిల్లా సహాయ కార్యదర్శి మద్దెపురం రాజు మాట్లాడుతూ సర్వేనెంబర్ 168 లోని 28 ఎకరాల 23 గుంటల భూమిని తక్షణం సర్వే చేసి భూమి లేని నిరుపేదలందరికీ పంపిణీ చేయాలని,సేద్యం చేసుకుంటున్నా నిరుపేదలకు పాస్ బుక్కులు ఇవ్వాలని లేకపోతే ఆ భూములన్నింటిని భూమి లేని పేదలను సమీకరించి సంఘము ఆధ్వర్యంలో పంపిణీ చేస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. చాలా సంవత్సరాల నుండి ఆ భూములను పేదలకు పంపిణీ చేయాలని అధికారులను కోరుచున్నామని అధికారులు మాత్రం స్పందించడం లేదని ఇప్పటికైనా అధికారులు ఆ భూమిని మొత్తం సర్వే చేసి హద్దురాళ్ళు పెట్టి పేదలకు ఇవ్వాలని సూచించినారు.భూమి ఉంటేనే పేదలకు దళితులకు ఆర్థిక వెసులుబాటు వచ్చి ఆత్మగౌరవంతో జీవిస్తారని సూచించారు.భూమి వచ్చేవరకు పేదలతో కలిసి పోరాటానికి కొనసాగిస్తామని వారు తెలియజేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో భీష్మాచారి, సత్తయ్య ,ఎల్లయ్య,కుమారస్వామి, బిక్షమయ్య,కుమార్,యాదగిరి, నర్సమ్మ,సైదమ్మ,ఈశ్వరమ్మ, చైతన్య,యాదమ్మ,సుగుణమ్మ, రేవతి,లక్ష్మి,మంజుల,శంకరమ్మ, పాండమ్మ,కళమ్మ,యాదగిరి, సునీత,సారమ్మ,భాగ్యమ్మ, యాదమ్మ,శోభ,సప్న,బుచ్చమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని ప్రజల సంక్షేమం, ఆరోగ్యమే సీఎం కెసిఆర్ అభిమతం: జెడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్



జగిత్యాల(జూన్ 27,23)వాయిస్ టుడే : జగిత్యాల జిల్లా లోని గ్రామాలలో అనునిత్యం సానిటేషన్ పనులు చేపట్టి, వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని దావ వసంత సురేష్, చైర్ పర్సన్, జి జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ ఆదేశించినారు. కార్యాలయములో జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించబడినది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము అత్యంత ప్రతిష్టాకరంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమములో భాగంగా జగిత్యాల జిల్లాలోని గ్రామీణ ప్రాంత పరిధిలోని అన్ని గ్రామాలలో ప్రజాపతినిధులు, అధికారుల భాగస్వామ్యంతో గ్రామీణ ప్రాంతంలోని ప్రజల ఆరోగ్యమును దృష్టి యందు ఉంచుకొని వృధా నీరు, మురుగు నీరు నిలిచిపోయి దోమల వలన మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా, ఈగలు తినే ఆహారము పై వాలడం వలన అనారోగ్యం పాలుకాకుండా నివారించుటకు ప్రజలకు అబ్ది చేకూరేలా అవగాహన పరచి తగు చర్యలు చేపట్టాలని అధికారులను జగిత్యాల జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్, దావ వసంత సురేష్ ఆదేశించారు.జిల్లాలోని చాల గ్రామాలలో రోడ్డు పైన నీరు నిలిచి వుండడం జరుగుచున్నది. ఇట్టి నీరు నిలువ వుండడం వలన అంటురోగములు వచ్చే ప్రమాదం ఉన్నందున వెంటనే గుర్తించి నీరు నిలిచి ఉండకుండా తగు చర్యలు చేపట్టుటకు ఇట్టి విషయములో సంబందిత ప్రజాపతినిధులు, డిఎల్పిఓ,యంపి ఓ లను, గ్రామ పంచాయతి కార్యదర్శులను భాగస్వామ్య పరచుటకు తగు సూచనలను జారీచేయాలని డిపిఓ ని జి ప్ర ప చైర్ పర్సన్ ఆదేశించారు. జి ల్లా లో ని గ్రామాలలో ఇదివరకు నాటిన చైనా బాదం మొక్కల స్థానంలో కానుగ లేదా వేప మొక్కలతో మార్పు చేయాలనీ తెలుపుతూ తరచుగా డిపిఓ, డిఎల్పిఓలు, యంపిఓలు గ్రామాలను సందర్శించి పల్లె ప్రగతి కార్యక్రమముల అమలును నిశితంగా పర్యవేక్షించి గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతారణము ఉండునట్లు తగు చర్యలు గైకొనాలని డిపిఓ ని జి ప్ర ప చైర్ పర్సన్ ఆదేశించారు. తెలంగాణ పల్లెలు అన్ని కూడా పచ్చదనం పరిశుభ్రత తో మెరుగైన ప్రగతి సాధిస్తున్న పల్లెలు కేసిఆర్ దర్శనియతకు నిదర్శనం అని అన్నారు.జిల్లాలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలను, మంకీ ఫుడ్ కోర్టులను సందర్శించి ఏ లక్ష్యము తో ఏర్పాటు చేశారో దానికి అనుగుణముగా తగు చర్యలు గైకోనాలని ఆదేశించారు. జిల్లా లోని అన్ని గ్రామాలలో వర్షా కాలమును దృష్టి యందు ఉంచుకొని ఫాగింగ్, బ్లీచింగ్ పౌడర్ చల్లే విధంగా ప్రత్యేక దృష్టి వహించి విష జ్వరాలు, అంటు వ్యాధులు ప్రభలకుండా గ్రామ పంచాయితీ సిబ్బంది అప్రమత్తం చేసి ప్రజలను అవగాహన పరిచి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతి అధికారిని కోరినారు.ప్రస్తుత వర్షా కాలమును దృష్టి యందు ఉంచుకొని జిల్లా లోని అన్ని గ్రామాలలో ఆశా వర్కర్లు, ఏ ఎన్ ఏం లు గ్రామ ప్రజలకు అంటు వ్యాధులు పట్ల, ఇంట్లో వ్యర్థంగా పడి వున్న టైర్లలో, పాత్రలలో, పరిసర ప్రదేశములలో నీరు నిలువ ఉండ కుండా జాగ్రత్తలు పాటించాలని, కాచి వడబోసిన నీటినే త్రాగాలని అవగాహన పరచాలని సర్క్యులర్ ద్వారా ఆదేశములు జారి చేయుటకు డియం అండ్ హెచ్ ఓ ని ఆదేశించారు.జిల్లా లోని అన్ని గ్రామాలలో గల ఓవర్ హెడ్ ట్యాంకులను నెలలో మూడు సార్లు విధిగా శుబ్రపరచి బ్లీచింగ్ పౌడర్ ను మోతాదు మించకుండా కలిపాలని సిబ్బందిని, అధికారులను అప్రమత్త పరిచి తద్వారా గ్రామ ప్రజలకు ఆరోగ్యకరమైన సురక్షితమైన త్రాగునీరు సరఫరా అగునట్లు తగు జాగ్రత్తలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజనీరు, మిషన్ భగీరథ,(ఇంట్రా)ని ఆదేశించారు.మిషన్ భగీరథ పైప్ లైన్ లు పలిగిపోయి త్రాగునీరు కలుషితంకాకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని కార్యనిర్వాహక ఇంజనీరు, మిషన్ భగీరథ,(ఇంట్రా)ని ఆదేశించారు.జిల్లాలోని ప్రతి కార్యాలయ పరిసర ప్రాంతలలో పిచ్చి మొక్కలు లేకుండా నీరు నిలువ ఉండకుండా ప్రతి శనివారం రోజున విధిగా సానిటేషన్ (పరిశుభ్రత) కార్యక్రమాన్ని తప్పకుండా చేపట్టడం వలన కార్యాలయ పరిసరాల శుభ్రతాతో స్వచ్ఛమైన వాతావరణాన్ని కల్గివుందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఇట్టి విషయములో అధికారులు తీసుకోనిన చర్యలపై నివేదికలను విధిగా జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయమునకు పంపవలసినదిగా అధికారులను ఆదేశించారు.నిత్యం గ్రామ పరిశుభ్రత కోసం కష్టపడుతున్న మల్టీ పర్పస్ వర్కర్స్ జీతం రూపాయలు 8500 నుండి రూపాయలు 9500 పెంచిన సీఎం కెసిఆర్ కి మల్టీ పర్పస్ వర్కర్స్ కృతజ్ఞతలు తెలిపారు.ఇట్టి సమీక్షా సమావేశము లో సిఈఓ(పూర్తి అదనపు భాధ్యతలు) రామానుజాచార్యులు, డిపిఓ దేవరాజ్ , డియం అండ్ హెచ్ఓ డాక్టర్ పి శ్రీధర్, డాక్టర్ ఏ శ్రీనివాస్, జిల్లా మలేరియా అధికారి, యంఎ రహమాన్, డిపిఆర్ఇ జి శేఖర్ రెడ్డి, ఇఇ, మిషన్ భగీరథ,(ఇంట్రా), డిప్యుటీ ఈ ఈ లు డిఎల్పిఓ జగిత్యాల, జగిత్యాల అర్బన్ అండ్ రూరల్ ఎంపిఓలు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి కెసిఆర్ రైతుల పక్షపాతి

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**

**రైతుబంధు నిధుల విడుదల పట్ల హర్షం వ్యక్తం**

**కోదాడ పిఎసిఎస్ చైర్మన్ ఆవుల రామారావు**

కోదాడ, జూన్ 27(వాయిస్ టుడే) రైతుల పక్షపాతి ముఖ్యమంత్రి కేసీఆర్ అని కోదాడ పిఎసిఎస్ చైర్మన్ ఆవుల రామారావు అన్నారు.మంగళవారం కోదాడ పట్టణంలోని స్థానిక పిఎసిఎస్ కార్యాలయంలో రైతు బంధు పథకానికి నిధులు విడుదల చేయటం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు.రైతుబంధు పథకానికి ఈ దఫా తో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 72,931 కోట్ల రూపాయలను పూర్తి పారదర్శకంగా ఏ ఒక్క రూపాయి దుర్వినియోగం కాకుండా నేరుగా రైతుల ఖాతాలో జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందన్నారు.రైతుల పక్షపాతి అయిన ముఖ్యమంత్రి కేసీఆర్ కి రైతులందరి పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ భారీ మెజారిటీతో గెలిచి రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ బుడిగం నరేష్, డైరెక్టర్లు గుండపునేని ప్రభాకర్ రావు, సోమపంగు. పార్వతి, సీఈఓ మంద వెంకటేశ్వర్లు, రైతులు,పిఎసిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# ప్రాథమిక పాఠశాలలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసిన వాకిటి శ్రీహరి

మాగనూరు జూన్ 27 (వాయిస్ టుడే) నారాయణపేట జిల్లా మాగనూర్ మండలం అడివి సత్యారం గ్రామంలో దాత రామకృష్ణ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పాఠ్య పుస్తకాలను మక్తల్ నియోజకవర్గ నేత, నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు మాట్లాడుతూ కొందరితో ఎంతో ఆస్తిపాస్తులు ఉన్న దానం చేసే గుణం కొందరిలోనే ఉంటుంది అలాంటి వారిలో రామకృష్ణ ఒకరు. ఇలాంటి సేవా భావాలు తనలో ఉన్నందుకు రామకృష్ణ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బి నరసింహులు, మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, మక్తల్ పట్టణ అధ్యక్షుడు రవి కుమార్, కొల్పూర్ రాములు, నరసింహ, హన్మంతు, రాఘవేంద్ర మరియు గ్రామ యువకులు తదితరులు హాజరయ్యారు.



# వేములవాడ నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబ సభ్యులందరికీ 20 లక్షల ప్రమాద బీమా సౌకర్యం

**వేములవాడ జర్నలిస్టుల కాలనీకి బోరుబావి విరాళం**

**ప్రజాస్వామ్యానికి ప్రతీకలు పత్రికా విలేకరులు**

**ప్రముఖ ఎన్నారై డాక్టర్ తోట రాంకుమార్**

వేములవాడ నియోజకవర్గంలోని వర్కింగ్ జర్నలిస్టులందరికీ, వారి కుటుంబ సభ్యులకు 20 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తానని ప్రముఖ ఎన్నారై, సామాజిక సైనికుడు డాక్టర్ తోట రామ్ కుమార్ జర్నలిస్టుల కుటుంబాలకు భరోసా కల్పించారు. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టి యు డబ్ల్యు జే హెచ్ 143 నూతన కార్యవర్గం, సభ్యులు మంగళవారం టీ ఆర్ కె కార్యాలయంలో రాంకుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. తోట రాంకుమార్ ఇటీవలే డాక్టరేట్ పొందిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రామ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ ప్రజాస్వామ్యానికి ప్రతీకలుగా కొనసాగుతున్న జర్నలిస్టులకు అభినందనలు తెలిపారు. జర్నలిస్టుల కష్టసుఖాల్లో తన వంతు పాత్రను పోషిస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వేములవాడ పట్టణానికి చెందిన సుమారు 60 మంది విలేకరులకు నివేషనా స్థలాలను గతంలో కేటాయించింది. అట్టి స్థలంలో జర్నలిస్టుల కాలనీ నిర్మాణానికి కార్యాచరణ రూపొందుతోంది. జర్నలిస్టుల కాలనీకి బోరు బావిని విరాళంగా తోటరామ్ కుమార్ ప్రకటించారు. కార్యక్రమంలో పాల్గొన్న లాయక్ పాషా మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో ప్రజలను ఆదుకొని,పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం అందజేస్తూ, సామాజిక కార్యక్రమాల్లో తనకంటూ ఓ ముద్ర వేసుకున్న తోటరాంకుమార్ కు శుభాకాంక్షలు తెలిపారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న వేములవాడ పట్టణంలో 4 టవర్లను నిర్మించి పట్టణానికి ఓ అందమైన రూపాన్ని కల్పించడంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఎడారి దేశంలో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి వేములవాడలో పెట్టుబడులు పెట్టి వందలాది మంది యువకులకు ఉపాధి కల్పిస్తున్న తోటరామ్ కుమార్ అభినందనీయుడన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య, ఉపాధ్యక్షులు రేగుల రాంప్రసాద్, మహమ్మద్ అజీమ్ లతోపాటు కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.



కరీంనగర్ పట్టణం పద్మ నగర్ బుల్ సెమన్ సెంటర్ లో నిధులతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలించి కాంట్రాక్టర్కు తగు సూచనలు చేసిన నగర మేయర్ యాదగిరి సునీల్ రావు.

# హంగు ఆర్భాటాలతో అబద్ధాలు చెప్పే బిఆర్ఎస్ ప్రభుత్వం: పొన్నం ప్రభాకర్

## ఎలగందుల ఖిల్లాను 9 సంవత్సరాలుగా ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలి



కరీంనగర్ రూరల్, జూన్ 27( వాయిస్ టుడే): చారిత్రక ఎలగందుల ఖిల్లా ను నేడు కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యులు పొన్నం ప్రభాకర్ కాంగ్రెస్ పార్టీ నాయకత్వంతో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తేది.02-02- 2014 లో అప్పటి టూరిజం శాఖ మంత్రి చిరంజీవి ద్వారా ఈ జిల్లా ఖ్యాతిని పెంచాలని, పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఎలగందుల ఖిల్లాలో 5 కోట్ల కేంద్ర పర్యాటక నిధులతో సౌండ్ అండ్ లైటింగ్ సిస్టం ప్రారంభించడం జరిగింది. కానీ ఈరోజు హంగు ఆర్భాటాలతో అబద్ధాలు చెప్పే బిఆర్ఎస్ ప్రభుత్వం, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఈ అభివృద్ధి పనులను పర్యవేక్షించకపోవడంతో వ్యవస్థ పూర్తిగా నాశనం అయిపోయింది.పునర్వ్యవస్థీకరణ పునర్నిర్మాణం పేరుతో ప్రభుత్వ కట్టడాలను కూల్చుతూ ప్రజాధనాన్ని వృధా చేస్తున్న బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఇంతటి చారిత్రక నేపథ్యం ఉన్న ఎలగందుల ఖిల్లాను 9 సంవత్సరాలుగా ఏమి అభివృద్ధి చేశారని కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రశ్నిస్తున్నాము.ఒకపక్క నీళ్ల పండుగను జరుపుకుంటూ ఖిల్లాకు వచ్చే సందర్శకులకు త్రాగునీటి సౌకర్యాన్ని విస్మరించినారు.ఖిల్లా అభివృద్ధిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాస్తాం.చారిత్రక ఎలగందుల ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేయడంలో స్థానిక పార్లమెంట్ సభ్యునికి, జిల్లా మంత్రికి సోయి లేదు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధి పనులపై ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తున్న బిఆర్ఎస్, బిజెపి, జిల్లా మంత్రికి పరిసర ప్రాంతాలలో నిర్మిస్తున్న ఫామ్ హౌస్ పై ఉన్న శ్రద్ధ ఖిల్లా అభివృద్ధిపై లేదు.ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లడమే నా ఉద్దేశం, గ్రామస్తుల విజ్ఞప్తి మేరకే ఖిల్లాను సందర్శించడం జరిగింది.ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ఈ గ్రామంలో మోడల్ స్కూల్, మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది.ఇప్పటికైనా ఈ ప్రాంతాన్ని పర్యటకంగా అభివృద్ధి చేయుటకు ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నాయకులు మేనేని రోహిత్ రావు, వైద్యుల అంజన్ కుమార్, సమద్ నవాబు, రహమతుసేన్, ఎండి తాజ్, పడాల రాహుల్, పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్ కుమార్, ఎస్ ఏ మోసిన్, వెన్న రాజ మల్లయ్య, బోనాల శ్రీనివాస్, కుర్ర పోచయ్య, గడ్డం శ్రీనివాస్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం శ్రీనివాస్ గౌడ్, సిరాజు, హుస్సేన్, సిరిపురం నాగ ప్రసాద్, కామిడీ రామ్ రెడ్డి, కంకణాల అనిల్ కుమార్ గుప్తా, షహేన్షా, నిహాల్ అహ్మద్, నూనె గోపాల్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, అహ్మద్, దన్ను సింగ్, కుంభల రాజకుమార్, పోరండ్ల రమేష్,ములుగు ప్రకాష్, నదీమ్, కీర్తి కుమార్, హరీష్, నవాజ్, వరదాల లింగమూర్తి, రంగా లావుడ్య, బూస వీరేశం పాల్గొన్నారు.



## గాయత్రి మాత మందిర నిర్మాణానికి లక్ష విరాళం

### -ఎన్నారై తోట రామ్ కుమార్

వేములవాడ, జూన్ 27 (వాయిస్ టుడే) వేములవాడ పట్టణంలోని గాయత్రి మాత మందిరానికి ఎన్నారై, డాక్టర్ తోట రాంకుమార్ లక్ష రూపాయల విరాళం అందజేశారు. గాయత్రి మాత ఆలయం చైర్మన్ గా కొనసాగుతున్న గతంలోనూ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన డాక్టర్ తోట రామ్ కుమార్ మరికొన్ని నిధులు అవసరం ఉన్నాయని ఆలయ ప్రతినిధులు కోరడంతో గురువారం నాడు మరో లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. అడగగానే అదనంగా లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చిన తోట రాంకుమార్ కు ఆలయ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు ముప్పిడి అహల్య, నునుగొండ అమృత, బూరుగు అరుణ, బింగి రాజేశ్వర, సనుగుల లింబాద్రి, వికుర్తి శంకరయ్య, సనుగుల భాస్కర్, కముటాల వేణు, గోపు బాలరాజు, ఉప్పుల దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అంబటి సంతోష్ నియామకం

వేములవాడ, జూన్ 27 (వాయిస్ టుడే): జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అధ్వర్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గా రాజన్న సిరిసిల్ల జిల్లా వేమలవాడ కి చెందిన అంబటి సంతోష్ యాదవ్ ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గా అది మల్లేశం పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా చిగుర్ల శ్రీనివాస్ కురుమ, జిల్లా ప్రధాన కార్యదర్శి గా సందబోయిన ప్రసాద్ యాదవ్ లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అర్ కృష్టయ్య చేతులమీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సదర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా అంబటి సంతోష్ యాదవ్ నియామకానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు.

# విద్యార్థినిలకు "ఆపరేషన్ జ్వాల"

## విద్యార్థినులు స్వీయ రక్షణ విధానాలు నేర్చుకోవాలి.. మహిళల రక్షణకు జిల్లా పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యం

### - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల, జూన్ 27 (వాయిస్ టుడే): సిరిసిల్ల పట్టణంలోని గీతనగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రోజున ఏర్పాటు చేసిన "ఆపరేషన్ జ్వాల" శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధుగా హాజరై ప్రారంభించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,మహిళల భద్రతను పెంపొందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లాలోని మహిళ విద్యార్థినిలకు సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఇక పై జిల్లాలోని 113 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో మూడు నెలల పాటు సెల్ఫ్ డిఫెన్స్ పై అనుభవం కలిగిన శిక్షకులచే శిక్షణ ఇస్తున్నామని మొదటగా ఈ రోజు సిరిసిల్ల వేములవాడలో 5 ప్రభుత్వ ఉన్నత పాటశాలల్లో 10 రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుత రోజులలో మహిళలకు స్వీయ రక్షణ చాలా అవసరమని అందుకే సెల్ఫ్ డిఫెన్స్ కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని స్పష్టం చేశారు. విద్యార్థినీలు ఆపద సమయాలలో ధైర్యంగా సమస్యను ఎదుర్కొనే విధంగా ఇలాంటి సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కేవలం ఆకతాయిల బారి నుండే కాకుండా చైన్ స్నాచింగ్, మహిళలపై లైంగిక దాడులు జరిగే క్రమంలో వారిని సమర్ధవంతంగా తిప్పికొట్టడం లాంటి టెక్నిక్స్ నేర్పించడం కోసమే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు.ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్క మహిళ స్వీయ రక్షణ విధానాలను నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.తెలంగాణ పోలీసులు మహిళలు, విద్యార్థినీల భద్రత, వారి రక్షణ కోసం నిరంతరం పని చేస్తున్నాయని, షీ టీమ్ పోలీసులు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలు, బస్ స్టాండ్స్, తదితర ప్రాంతాలలో సివిల్ దుస్తులతో సంచరిస్తూ ఆకతాయిల బారి నుండి రక్షణ కల్పించే విధంగా పని చేస్తున్నారని తెలిపారుమహిళలూ విద్యార్థినులు ఏలాంటి వేధింపులకు గురైన నిర్భయంగా ముందుకు వచ్చి జిల్లా షీ టీమ్ కి గాని డయల్ 100 కి సమాచారం అందించి సమస్యను పరిష్కరించుకోవలని అన్నారు. జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజం లో మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని కానీ ఎక్కడో ఒక చోట వేధింపులకు గురవుతున్నారని దీనిని నిర్మూలించే బాధ్యత సమాజం లో ఉన్న ప్రతి ఒక్కరి పై ఉందన్నారు.మహిళలు తమను తాము రక్షించుకునేందుకు ఈ సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ ఎంతగానో ఉపయోగపడతాయని పోలీస్ శాఖ కల్పించిన ఈ వకాశాన్ని ప్రతి ఒక్క విద్యార్థిని ఉపయోగించుకోవాలని అన్నారు.జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ పై శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సి.ఐ లు అనిల్ కుమార్,ఉపేందర్, ప్రధానోపాధ్యాయులు బాగ్యారేఖ డిసిడిఓ పద్మజ,ఎస్.ఐ శ్రీకాంత్, రమేష్, రాజు,కారేట్ మాస్టర్ మన్నాన్,పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## చామగడ్డల మాలల అలంకరణలో అమ్మవారు



కరీంనగర్ మండలం నగునూర్లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యలో జరుగుతున్న ఆషాడమాసం శాఖాంబరీ ఉత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీదుర్గాభవానీ అమ్మవారిని చామగడ్డల మాలలతో అలంకరించారు. ఆలయ పూజారులు అమ్మవారికి విశేష హారతులిచ్చి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మెన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులతోపాటు భక్తులు పాల్గొన్నారు.



## తూప్రాన్ మున్సిపాలిటీలో కోటి 70 లక్షలతో అభివృద్ధి పనుల ప్రారంభం

### 16 వార్డులో సీసీ రోడ్డు ప్రారంభించిన కౌన్సిలర్ కొడిప్యక నారాయణ గుప్తా, జడ్పిటిసి రాణి సత్యనారాయణ గౌడ్

మెదక్ తూప్రాన్ 27 జూన్ (వాయిస్ టుడే) : మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని 16 వార్డులో కోటి 70 లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. 16 వ వార్డులో సాయి నగర్ కాలనీలో సిసి రోడ్డు పనులను జడ్పిటిసి రాణి సత్యనారాయణ గౌడ్, కౌన్సిలర్ నారాయణ గుప్త లు పనులను ప్రారంభించారు...అనంతరం వారు మాట్లాడుతూ సీఎం కెసిఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని మళ్ళీ తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వం వస్తుందన్నారు.. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు మామిడి వెంకటేష్ మామిండ్ల కృష్ణా ముదిరాజ్, చెలిమెల రఘుపతి,, మాజీ ఎంపీటీసీ సభ్యులు తిమ్మాపురం నరసింహులు, వెంకటేశ్ యాదవ్ 16వ వార్డు అధ్యక్షులు బుక్క విజయకుమార్, ఆంజనేయులు, అర్యవైశ్యా సంఘం నాయకులు ఉప్పల నర్సింలు గుప్తా,నీలం ప్రవీణ్ గుప్తా, బిఆర్ఎస్ నాయకులు బాబి నాయుడు, జాఫర్, జావిద్, సమీర్, బందెల నరేష్, రాజు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




## ప్రైవేట్ బడికి పిల్లల్ని పంపిస్తే రేషన్ కార్డు, పింఛన్ రద్దు

రఘునాథపల్లి, జూన్ 27, (వాయిస్ టుడే) ప్రభుత్వం అందించే అన్ని సదుపాయాలను ఉపయోగించుకొని పిల్లల్ని మాత్రం ప్రభుత్వ బడికి పంపకుండా ప్రైవేట్ స్కూల్ కు పంపే వారికి రేషన్, పింఛన్, కరువు పనులు సైతం రద్దు చేస్తామని జాఫర్ గూడెం గ్రామ సర్పంచ్ సునీత తల్లిదండ్రులను హెచ్చరించారు. మంగళవారం మండలంలోని జాఫర్ గూడెం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాగ కైలాసం, సర్పంచ్ సునీత, ఉప సర్పంచ్ స్వప్న కలిసి ప్రైవేట్ స్కూల్ బస్సును నిలిపి ప్రైవేట్ స్కూల్ కు పిల్లల్ని పంపే తల్లిదండ్రులతో వారు మాట్లాడారు.తల్లిదండ్రులు పిల్లల చదువుల కొరకు వేలకు వేలు రూపాయలు వెచ్చించి ప్రైవేట్ పాఠశాలకు పంపిస్తే పిల్లలకు సరియైన విద్య అందక తల్లిదండ్రులు నష్టపోవాల్సి వస్తుందని వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఏలాంటి పైసా ఖర్చు లేకుండా నాణ్యమైన విద్య అందిస్తున్నారని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరారు. అదేవిదంగా ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.లేకుంటే గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు క్రమక్రమంగా మూతపడే అవకాశం ఉంటుందని వారు హెచ్చరించారు. దింతో పేద, మధ్య తరగతి పిల్లలు చదువుకు దూరమై, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే స్థోమత లేక భవిష్యత్తులో వారు దుర్భరమైన పరిస్థితిని ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి ప్రతి ఒక్కరు ఆలోచన చేయాలనీ వారు కోరారు. దింతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రవేట్ పాఠశాలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలలో జాయిన్ చేయడం జరిగింది.ఈ సందర్బంగా తల్లిదండ్రులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శాఖ కైలాసం అభినందించారు.ఇందులో గ్రామ పెద్దలు ఏదునూరి గట్టేషం, మల్లేశం, సమ్మయ్య, బిక్షపతి, మధు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## మహారాష్ట్ర ఆలయాల్లో తెలంగాణ ఎమ్మెల్యేలు

మక్తల్ జూన్ 27 (వాయిస్ టుడే): నారాయణపేట మహారాష్ట్రలోని పండపురిలో శ్రీ విట్టల్ రుక్మిణి దేవి ఆలయం తుల్జాపూర్ లోని అంబా భవాని దేవి మాతను మంగళవారం నారాయణపేట ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి సహచర ఎమ్మెల్యేలతో కలిసి దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు

# ధ్వజమెత్తిన జర్నలిస్టులు

**తాసిల్దార్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**నల్ల బ్యాడ్జీలతో నిరసన**

**జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేత**





మేడ్చల్ ప్రతినిధి ( వాయిస్ టుడే ) జూన్ 27 కాప్రా తహసిల్దార్ అనిత పై జిల్లా కలెక్టర్ శాఖపరమైన చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు ధ్వజమెత్తారు ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో బాధ్యత రహితంగా వ్యవహరిస్తున్న కాప్రా మండల తహసిల్దార్ తీరును ఎండగడుతూ కథనాలను ప్రచురించిన విలేకరి సత్యనారాయణ మనోభావాలను కించపరిచే విధమైన సంభాషణతో కేసులు పెడతానంటూ బెదిరింపులకు గురిచేసిన తహసిల్దార్ వ్యవహార శైలిని నిరసిస్తూ జవహర్ నగర్ జర్నలిస్టులు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముందుగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి పక్కన ఉన్న ప్రధాన బస్టాండ్ వద్ద గల మహనీయులు బాబా సాహెబ్ అంబేద్కర్ బాబు జగ్జీవన్ రామ్ ల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం ర్యాలీగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ చేరుకొని కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జర్నలిస్ట్ యూనియన్ టీయూడబ్ల్యూజే మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బొమ్మ అమరేందర్ హాజరై మద్దతు తెలిపారు ఈ సందర్భంగా పలువురు మీడియా మిత్రులు మాట్లాడుతూ జవహర్ నగర్ లో గతంలో తహసిల్దారులుగా విధులు నిర్వహించిన ఏ తహసిల్దార్ హయాంలో ప్రభుత్వ భూముల కబ్జాల పర్వం కొనసాగని విధంగా నేడు కాప్రా తహసిల్దార్ గా విధి నిర్వహణలో ఉన్న అనిత హయాంలో అంతుచిక్కని విధంగా ప్రభుత్వ భూముల కబ్జాల వ్యవహారం కొనసాగడం శోచనీయాంశమని అన్నారు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతంలో ఎన్నో ప్రభుత్వ భూములు కబ్జా రాయుళ్ల హస్తగతమై ఉండగా మరెన్నో ఎకరాల భూములు కబ్జాలకు గురై అక్రమ నిర్మాణాలతో దర్శనమిస్తున్నప్పటికీ అట్టి ప్రభుత్వ భూములను పరిరక్షించి కబ్జాకు పాల్పడిన అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా తహసిల్దార్ ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విధి నిర్వహణలో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు కాదా అని నిలదీశారు తహసిల్దారుగా విధి నిర్వహణలో ప్రభుత్వ భూముల పరిరక్షణలో విఫలమవుతున్నారని అనడానికి నిలువెత్తు నిదర్శనం ఎన్నో సర్వే నెంబర్లకు చెందిన ప్రభుత్వ భూముల్లో దర్శనమిస్తున్న అక్రమ నిర్మాణాలు కాదా అని మండిపడ్డారు తహసిల్దార్ ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో నిర్లక్ష్య ధోరణిని వ్యవహారాన్ని విలేఖరి సత్యనారాయణ విధి నిర్వహణలో భాగంగా కథనాలు ప్రచురించి కబ్జాల వ్యవహారాన్ని బహిర్గతం చేస్తే సభ్యత సంస్కారం లేకుండా విలేఖరి సత్యనారాయణ మనోభావాలు దెబ్బతినే విధంగా దూషణపూరితమైన సంభాషణతో అవమానించడమే కాకుండా కేసులు పెడతానని విలేకరిని భయభ్రాంతులకు గురి చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు తహసిల్దార్ అనిత నేతృత్వంలో జవహర్ నగర్ లో విచ్చలవిడిగా ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్న విషయం పట్ల జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి తాసిల్దార్ వ్యవహార శైలి పట్ల ప్రత్యేక దర్యాప్తు జరిపించి ప్రభుత్వ భూములను పరిరక్షించలేని తహసిల్దార్ పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు జవహర్ నగర్ జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు



## సేవా కార్యక్రమాలతో ప్రజలకు దగ్గరవ్వాలి

**బిజెపి జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి**

కరీంనగర్, జూన్ 27( వాయిస్ టుడే): పోలింగ్ బూత్ లో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరయ్యేలా పనులు చేయాలని బిజెపి కరీంనగర్ జిల్లా కార్యదర్శి రంగు భాస్కరాచారి పేర్కొన్నారు.పోలింగ్ బూత్ వారిగా బిజెపి ని పటిష్టపరిచే క్రమంలో భాగంగా మధ్యప్రదేశ్ రాష్ట్రం లో ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం మేరా బూత్ సబ్సే మజ్బూత్ అనే కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా టీవి లో ప్రసారమైన కార్యక్రమాన్ని మండలంలోని కార్యకర్తలు వీక్షించారు.ఈ సందర్భంగా మండల ఇంచార్జి గా హాజరైన భాస్కర్ మాట్లాడుతూ ప్రజలతో ఉండే సంబంధాలతోనే పార్టీ అభివృద్ధి జరుగుతుందని అన్నారు.జాతీయ, రాష్ట్ర పార్టీ ల సూచనలకు అనుగుణంగా బూత్ అధ్యక్షులు వ్యవహరించి బూత్ స్థాయిలో పార్టీ ని విస్తరించాలని కోరారు.బూత్ కమిటీ నాయకుల యొక్క పనితీరుతోనే అధికారంలోకి వస్తామని అందుకే ప్రతీ బూత్ కార్యకర్త శక్తివంచన లేకుండా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరాచారి,జిల్లా ఈసీ సభ్యులు తమ్మిశెట్టి మల్లయ్య, మావురపు సంపత్,ప్రధాన కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, ఉపాధ్యక్షులు పబ్బ తిరుపతి,బోనాల వెంకటేష్,బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,దళిత మోర్చా అధ్యక్షులు ఎల్కపల్లి స్వామి,కిసాన్ మోర్చా అధ్యక్షులు కంది రాజేందర్ రెడ్డి,కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బోనాల మోహన్,అధికార ప్రతినిధి వేల్పుల రవీందర్ యాదవ్,ఓబీసీ మోర్చా ఈసీ సభ్యులు కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, కిసాన్ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,పాశం వెంకటయ్య, రేగుల శ్రీనివాస్,చింతల సంపత్ రెడ్డి, కందుకూరి ఈశ్వరాచారి,పార్నంది సంపత్,పాశం వెంకటయ్య,మాడిశెట్టి సత్యనారాయణ, దుర్శెట్టి అజయ్ పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిపై ప్రతి పోలీసు అధికారికి అవగాహన ఉండాలి

**నేర స్వభావం కలిగిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలి**

**సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్**




జగిత్యాల జిల్లా ప్రతినిధి(జూన్ 27,23)వాయిస్ టుడే:ఎన్నికల నియమావళి, ప్రవర్తన పై ప్రతి పోలీసు అధికారి అవగాహన పెంచుకొని రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు.మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎన్నికల సమయంలో పోలీస్ శాఖ తీసుకోవాల్సిన చర్యలు, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు తీసుకోవలసి చర్యలు వివరించారు.ఎన్నికల నియమావళి, ప్రవర్తన పై ప్రతి పోలీసు అధికారి అవగాహన పెంచుకొని రానున్న ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని,జిల్లాలో పోలింగ్ కేంద్రాలు వాటిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు,నార్మల్ పోలింగ్ కేంద్రాల లో, ఎలాంటి సమస్యలు లేకుండా ముందస్తు ప్రణాళికలను సంబంధిత రెవెన్యూ అధికారులతో కలిసి ప్రతి పోలింగ్ కేంద్రని సందర్శించి వాటి స్థితిగతులు భౌగోళిక పరిస్థితుల గురించి తెలపాలని సూచించారు.ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పై దృష్టి సారించాలని తెలిపారు.విఐపి, వివిఐపి, వచ్చిపోయే సమయాలలో అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా హైదరాబాదులో జరిగిన ఎన్నికల కమిషన్ సమావేశంలో వారు సూచించిన ఎలక్షన్ నియమావళి గురించి అధికారులకు వివరించారు.చట్టవ్యతిరేక కార్యక్రమాలు అయిన గంజాయి,పేకాట, గుడుంబా వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో స్థలం అనువుగా ఉన్న పోలీస్ స్టేషన్ లలో నర్సరీలును పెంచడానికి ఏర్పాట్లు చేయాలని సూచించారు. 5s లో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆహ్లాదకర వాతావరణం ఉండే విధంగా ప్రతి పోలీస్ స్టేషన్ ఉండాలని సూచించారు.నేర స్వభావం కలిగిన వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలి.గత ఎన్నికల సమయంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కింద కేసులు నమోదు అయిన వ్యక్తులు, భూతగాదాల విషయం లో, పాత కక్షలు మనసులో పెట్టుకుని నేరాలు చేసేవారిని నేర స్వభావం కలిగిన వ్యక్తులను పోలీస్ స్టేషన్ల వారిగా గుర్తించి బైండోవర్ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని అన్నారు.రోడ్డు ప్రమాదాల నివరణపై అన్ని స్థాయిల అధికారులు మరింత దృష్టి సారించాలి.హైవేలపై జరిగే యాక్సిడెంట్ లకు సంబంధించి ఫస్ట్ రెస్పాండర్స్ గా ఉండేందుకు హైవేలపై ఉన్న పెట్రోల్ బంక్ వారికి, దాబాలో పనిచేసే వారికి, యూత్ ,విలేజెస్, కి ఫస్ట్ ఎయిడ్ సిపిఆర్ పై అవగాహన కలిగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. బ్లాక్ స్పాట్స్(ప్రమాదాలు అధికముగా జరుగు ప్రదేశాలు) గుర్తించి పంచాయతీ రాజ్ ఆర్ అండ్ బి ప్రబుత్వ శాఖల సమన్వయంతో ప్రమాదాల నివరణపై దృష్టి సారించాలని అన్నారు.ఈ యొక్క సమావేశంలో డిఎస్పీలు ప్రకాష్, రవీంద్ర రెడ్డి, రవీంద్ర కుమార్, సిఐలు నటేష్, లక్ష్మీనారాయణ, ఆరిఫ్ అలీ ఖాన్, కోటేశ్వర్, ప్రవీణ్ కుమార్, రమణమూర్తి ఎస్ఐ లు డీసీఆర్బి , ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.



**రాజపేట మండలం బొందుగులలో**

## ఆస్తుల కోసం తండ్రిని కొట్టిన తనయుడు

యాదాద్రి భువనగిరి జిల్లా (వాయిస్ టుడే 27): కొత్త బిక్షపతి కి ముగ్గురు కుమారులు ఒక్క అమ్మాయి. రెండో కుమారుడైన కొత్త థామస్ ఆస్తికోసం తన తండ్రిని టవాలుతో ఉరిబిగించి కర్రలతో కొట్టి చంపనికి ప్రయత్నం చేశాడు. కొట్టినప్పటి నుండి ఇప్పటివరకు తన భర్త కోల్పోవడం లేదని ఆక్సిజన్ ద్వారానే ఉంటున్నారని తనకు వారి రెండో కుమారుడు కొత్త థామస్ వాళ్ల భార్య చంద్రకళ తో ప్రాణం భయం ఉందని అలాగే తన బిడ్డ కొనుక్కున్న ప్లాటును అక్రమంగా కబ్జా చేసి భయం బాంతులకు గురిచేసి అక్రమంగా ఇల్లు కట్టుకుంటున్నాడని ఆ ఇల్లుకు ఎలాంటి పర్మిషన్ లేకున్నా ఇంటి నిర్మాణం చేస్తున్నాడు. అధికారులు స్పందించి అక్రమంగా కట్టిన ఇల్లును తొలగించి మాకు న్యాయం చేయగలరని అధికారులను కోరారు అలాగే కుటుంబ సమస్యలని రాజకీయ పార్టీలకు లాగుతున్నారని అతని భార్య అనసూయ ఆవేదన వ్యక్తం చేశారు.



## రైతులు పిఎసిఎస్ వంగపల్లి ద్వారా అందించే సేవలను, రుణాలను సద్వినియోగం చేసుకోగలరు

**డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి**

భువనగిరి, జూన్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి):- నల్లగొండ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్, తెలంగాణ రాష్ట్ర సహకారపై అపెక్స్ బ్యాంక్ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి చిన్న కందుకూరు గ్రామానికి చెందిన కోళ్ల సత్తయ్యకు గొర్రెల పెంపకం కొరకు 8 లక్షల రూపాయల రుణ మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా డిసిసిబి చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వంగపల్లి ద్వారా రైతులకు రుణాలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలియజేస్తూ అదేవిధంగా రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం బలోపేతానికి కృషి చేయాలని తెలియజేశారు.

# సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**80శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరిగేలా చూడాలి**

**ప్రతి మంగళ, శుక్రవారాలు ఫ్రైడే తప్పనిసరిగా చేపట్టాలి: జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



రాజన్న సిరిసిల్ల, జూన్ 27 (వాయిస్ టుడే): జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్న 63 శాతం సంస్థాగత ప్రసవాలను 80 శాతంకు పెంచాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యాధికారులను ఆదేశించారు.

మంగళవారం కలెక్టరేట్లోని మినీ మీటింగ్ హాల్ లో వైద్యారోగ్య శాఖ పనితీరును జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా అదనపు కలెక్టర్ బి సత్యప్రసాద్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు లతో కలిసి సమీక్షించారు.జిల్లాలోని జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి , ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యుల కృషి వల్లే ప్రభుత్వ ఆసుపత్రులలో ఇనిస్టిట్యూషన్స్ డెలివరీలు పెరుగుతున్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రస్తుతం 63% గా ఉన్న డెలివరీలను 7-9 నెలల గర్భిణీలు, గైనకాలజిస్టులతో సమావేశాలు నిర్వహించి గర్భిణీ లో కాన్ఫిడెన్స్ నింపాలన్నారు. తద్వారా ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీల సంఖ్యను 80% కు పైగా పెంచాలన్నారు. మొదటి కాన్పు సాధారణ ప్రసవం అయ్యేలా చూడాలన్నారు.జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రతినెల మొదటి బుధవారం గ్రామసభను నిర్వహించి ప్రభుత్వ జిల్లా, ఏరియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన వసతులను గురించి తెలియజేయాలన్నారు. ప్రధానంగా గర్భిణీలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం, ప్రభుత్వ ఆసుపత్రులలో డెలివరీ చేసుకుంటే గర్భిణీలకు ప్రభుత్వ పరంగా కలిగే ప్రయోజనాలను గ్రామ సభలో ప్రజలందరూ ముందు చెప్పాలన్నారు.జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను వచ్చే దసరా కల్లా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా లక్షణాలతో బాధపడుతున్న మహిళలకు నోటి, బ్రెస్ట్ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నప్పటికీ , సర్వైకల్ క్యాన్సర్ పరీక్షలు ఆశించిన మేర జరగడం లేదన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యులకు జిల్లా కలెక్టర్ సూచించారు క్యాన్సర్ నిర్ధారణ అయిన మహిళల ట్రీట్మెంట్ సరిగ్గా జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు.వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా ప్రబలకుండా అధికారులు సీరియస్‌గా పనిచేయాలన్నారు. ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రైడే కచ్చితంగా పాటించాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో నిల్వవున్న నీటిలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. స్ప్రేయింగ్, శానిటేషన పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా చేపట్టాలన్నారు. ఇప్పటికే సరిపడా టెస్టు కిట్స్ ఉన్నందున లక్షణాలను బట్టి పరీక్షల సంఖ్యను గ్రామీణ పెంచాలన్నారు. పరీక్షలను సాధ్యమైనంత ఎక్కువ చేస్తేనే వ్యాధులను వీలైనంత మేర అరికట్టవచ్చునన్నారు. వర్షాకాలం ముగిసే వరకు క్షేత్రస్థాయిలో కీటక జనిత వ్యాధుల పై రిపోర్ట్ ప్రతి రోజూ సాయంత్రం అందించాలని చెప్పారు.

ఫిజియోథెరపీ సేవలను కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతిరోజు వాటి అవసరం ఉన్న ప్రజలకు అందేలా చూడాలన్నారు.కిరణం కార్యక్రమం ద్వారా మానసిక సమస్యలతో బాధపడుతూ సహాయం కోసం ఫోన్ చేసిన వారికి కౌన్సిలింగ్ అందించాలన్నారు.అవసరమైతే మెడికేషన్ అందించాలని సూచించారు.డిప్యూటీ జిల్లా వైద్యాధికారులు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత,జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ మురళీధర్ రావు, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ మహేష్, పిహెచ్సి మెడికల్ ఆఫీసర్ లు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రూప్-IV పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా రెవిన్యూ అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**

భువనగిరి, జూన్ 27 (వాయిస్ టుడే ప్రతినిధి):- తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ గ్రూప్-%×ఎ% పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవిన్యూ అడిషనల్ కనెక్టర్ డి.శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వచ్చే జూలై 1న నిర్వహించబడే గ్రూప్-%×ఎ% పరీక్ష నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, రూట్ ఆఫీసర్లు, లైజనింగ్ అధికారులతో నిర్వహించబడిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణకు 70 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, దీని కోసం18 రూట్లను రూపొందించడం జరిగిందని,పరీక్షల నిర్వహణకు 70 మంది చీఫ్ సూపరింటెండెంట్లు,74 మంది లైజనింగ్ అధికారులు, 38 మంది రూట్ ఆఫీసర్లను నియమించడం జరిగిందని,జిల్లాలో మొత్తం 19,800 మంది అభ్యర్థులు పరీక్షలు వ్రాయనున్నట్లు ఆయన తెలిపారు. జులై 1 న జరిగే పరీక్షలు ఉదయం 10.00 గంటల నుండి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి 5.00 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియమ నిబంధనలు ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని, ఇన్విజిలేటర్లతో ముందుగా అవగాహన సమావేశం ఏర్పాటు చేసుకొని నిబంధనలను క్షుణ్ణంగా వివరించాలని సూచించారు. పరీక్షా కేంద్రం లోనికి సెల్ ఫోన్లు, వాచీలు, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ కు అనుమతి లేదని,పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించే ముందు వారి వద్ద సెల్ ఫోన్లు, వాచీలు, క్యాలిక్యులేటర్లు, బ్లూ టూత్, పెన్ డ్రైవ్ లు, హియరింగ్ ఎయిడ్స్ తదితర ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ లేకుండా క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించాలన్నారు. అభ్యర్థులు షూ ధరించి రావద్దని,చెప్పులు ధరించి రావాలని,అభ్యర్థులతో పాటు ఇన్విజిలేటర్లకు కూడా సెల్ ఫోన్లు అనుమతించవద్దని అన్నారు. పరీక్ష కేంద్రం లోనికి ఐ.డి.కార్డ్, హాల్ టికెట్ లేకుండా అభ్యర్థులను ఎవ్వరినీ అనుమతించవద్దని తెలిపారు. ముందుగా తహశీలుదారులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి వసతులపై జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థుల కోసం భవనంలో క్రింద ఫ్లోర్ లో ఉన్న గదులు కేటాయించాలని సూచించారు. ఈ సమావేశంలో భువనగిరి రెవెన్యూ డివిజన్ అధికారి భూపాల్ రెడ్డి,చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారి ఉపేందర్ రెడ్డి,కలెక్టరేట్ విభాగం సూపరింటెండెంట్లు శ్రీనివాసరాజు, గిరిధర్, మానస తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే
జనగాత్రం - మనసూత్రం
హైదరాబాద్
బుధవారం 28 జూన్ 2023

# వికలాంగులు ఫారం 8 ద్వారా ధరఖాస్తు చేసుకోవాలి

**అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారందరికి ఓటర్‌గా నమోదు చేసేందుకు స్పెషల్ డ్రైవ్**

**అక్టోబర్ 4న ఫైనల్ పబ్లికేషన్**

**జిల్లా కలెక్టర్ ఆర్.వి. కర్ణన్**




కరీంనగర్, జూన్ 27 (వాయిస్ టుడే): పి.డబ్ల్యూ.డి (వికలాంగులైన) ఓటర్ల కొరకు ఎన్నికల సంఘం మరిన్ని సౌకర్యాలను కల్పించిందని, దానికి అనుగుణంగా వికలాంగులైన ఓటర్లు ఫారం -8 ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్వ ఆర్.వి. కర్ణన్ సూచించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం (పి.డబ్ల్యు.డి) వికలాంగులైన ఓటర్లకు అనుగునంగా పోలింగ్ బూత్ ల వద్ద సౌకర్యాలను కల్పించే దిశగా చర్యలను చేపట్టడం జరిగిందని తెలిపారు. వికలాంగులైన వారు ఫారం -8 ద్వారా ఎటువంటి ధృవీకరణలను జతచేయాల్సిన అవసరం లేకుండా, వారు వికలాంగులని మార్క్ చేసి ఇచ్చిన చాలని, ఇదివరకే ఓటరు గుర్తింపు కార్డు ఉన్న వారు కుడా ఫామ్-8 ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. జిల్లాలో జూన్ 23 నాటికి ఇంటింటి ఓటరు సర్వేను పూర్తిచేసుకోవడం జరిగిందని, జిల్లాలోని అన్ని నియోజక వర్గాల వారిగా కొత్తవారిని ఓటరుగా గుర్తించడం, ఓటరు ఫోటోలలో మార్పులు, నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు లేదా మార్పు ఇతర సౌకర్యాల కల్పన గురించి జూలై 24 లోగా తెలియజేయాలన్నారు. ఒకచోటు నుండి మరో చోటుకు ఓటు హక్కును బదిలిచేయాలనకునే వారు నేరుగా ఫారం సమర్పిస్తే సరిపోతుందని, ఆటోమెటిక్ గా ఇదివరకు ఉన్నటువంటి ఓటు గుర్తింపు కార్డు రద్దయి దరఖాస్తు చేసిన స్థానానికి వచ్చేస్తుందని తెలిపారు. రివిజన్ ఆక్టివిటిలో బాగంగా అగస్టు 2 న డ్రాఫ్ట్ ఎలక్ట్రోరోల్ ఏర్పాటు చేసిన అదేరోజు నుండి 31 అగస్టు వరకు ఫిర్యాదులను స్వీకరించి సెప్టెంబర్ 22 నాటికి అభ్యంతరాలను తొలగించడం జరుగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ 4 న ఫైనల్ పబ్లికేషన్ ను విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో చేపడుతున్న ఎన్నికల పనులను పరిశీలించిన ఎన్నికల పర్యవేక్షకులు జిల్లా యంత్రా%శీ%గాన్ని అభినందించారన్నారు. జిల్లాలో అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారందరికి ఓటర్లుగా గుర్తించేలా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలు, డిగ్రీ, ఇంజనీరింగ్, వైద్య కళాశాలలో ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, అన్ని నియోజకవర్గాలలోని బిఎల్‌ఏ లద్వారా 18 సంవత్సరాలు నిండిన అర్హులైన ప్రతిఒక్కరు ఓటరుగా గుర్తించబడేలా ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలను స్థానిక తహసీల్దార్లు పరిశీలిస్తారని, అదనంగా ఎమైన సౌకర్యాల కావాల్సి వస్తే సూచించాలన్నారు. కలెక్టర్ అంతకుముందు ఈవీఎం గోడౌన్ లో ఎఫ్ ఎల్ సి చెకింగ్ ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, శిక్షణ జాయింట్ కలెక్టర్ నవీన్ నికొలస్, డి ఆర్ డి ఓ శ్రీలత, తహసీల్దార్ సుధాకర్, డిప్యూటీ తహసిల్దార్ తహసీన్, బిఎస్పి పార్టీ ప్రతినిధి గోలి అనీల్ కుమార్, బిజెపి పార్టీ ప్రతినిది నాంపెల్లి శ్రీనివాస్, సిపిఐ(యం) పార్టీ ప్రతినిధి మిల్కూరి వాసుదేవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రతినిది మోహన్ చారి, బిఆర్ఎస్ పార్టీ ప్రతినిది పి. శివ, టిడిపి పార్టీ ప్రతినిది ఎర్రవెల్లి రవీందర్, అధికారులు పాల్గొన్నారు.



## ఆశయాలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలమయ్యారు

**బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**

అంబర్ పేట, జూన్ 27 ( వాయిస్ టూడే) వందలాది మంది విద్యార్థుల ఆత్మ బలిదానంతో ఏర్పడ్డ తెలంగాణలో అమరుల ఆశయాలు నెరవేర్చడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ విఫలమయ్యారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ విమర్శించారు. బాగ్ అంబర్పేట పోచమ్మ బస్తీలో అంబర్పేట నియోజకవర్గం బీఎస్పీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. గుత్తెదారులు ఇచ్చే కమిషన్లకు కక్కుర్తిపడి బడా కంపెనీలకు వేల కోట్లు దోచిపెడుతున్నారని ఆరోపించారు. మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత ప్రత్యేక విమానంలో రూ.100 కోట్లు దిల్లీకి తరలించినట్టు ఈడీ కేసు నమోదు చేసినా ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా బహుజన వర్గాలకు ఆత్మగౌరవం, రాజకీయ ప్రాధాన్యత దక్కాయని తెలిపారు. ఎన్నికల ముందు ఓట్ల కోసం ప్రజల ముందుకు వస్తున్న కుంభకోణాల భారాసను ఓడించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు రుద్రవరం సునీల్, నియోజకవర్గం అధ్యక్షుడు పిల్లి జగన్ గంగపుత్ర, రాష్ట్ర అధికార ప్రతినిధి అరుణ్, జిల్లా ఇన్చార్జీలు బాలరాజు, నరేందర్, మైనార్టీ కన్వీనర్ అబ్రహార్ హుస్సేన్, క్రిస్టియన్ కన్వీనర్ ఎల్డీ శాంసన్, జిల్లా మహిళా కన్వీనర్ రజిత, జిల్లా ఉపాధ్యక్షులు విశ్వాచారి, బండారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



## నాలాపై స్లాబ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్**

కూకట్ పల్లిబీ జూన్ 27(వాయిస్ టుడే) రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో మూసాపేట్ డివిజన్ స్నేహపురి కాలనీలో జరుగుతున్న నాలా స్లాబ్ పనులను స్థానికులతో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులు నిర్వహించాలని, వర్షాకాలం ప్రారంభం మవుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, సూచికల బోర్డులను ఏర్పాటు చేయాలని కాంట్రాక్టరు కు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తిరుపతి, కాలనీ అధ్యక్షుడు వినోద్ యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, రాజు చారి, శేఖర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి, జూన్ 27(వాయిస్ టుడే) శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని ఆల్విన్ కాలనీ124 డివిజన్ శంశీగూడ పరిధిలోని సాయి చరణ్ కాలనీలో రూ.10 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేపట్టి యుద్ధ ప్రాతిపదిక పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. అలాగే వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సీసీ రోడ్డు నిర్మించాలని సంబంధిత అధికారులకు మరియు కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ కార్యక్రమంలో పాండుగౌడ్, శివరాజ్ గౌడ్, వెంకట్ నాయక్, లక్ష్మమ్మ, ఎడ్ల సత్యనారాయణ, సుందు యాదగిరి, పోశెట్టిగౌడ్, సుధాకర్ రెడ్డి, వెంకటయ్య, ఏసుదాస్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.ం

## మద్యం మత్తులో హల్చల్

**పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు: పట్టణ సిఐ వెంకటేష్**



వేములవాడ, జూన్ 27 (వాయిస్ టుడే) వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్ ప్రాంతంలో పట్టణ ట్రాఫిక్ ఎస్సై దిలీప్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వ హించారు. వాహనాలు తనిఖీలో అతిగా మద్య సేవించి అటువైపు వస్తున్న చందుర్తి మండలానికి చెందిన దండుగుల రెడ్డి, గొట్టెల గట్టయ్య, పోలీస్ ల పై దురుసుగా ప్రవర్తించడమే కాకుండా చేయి చేసుకోవడంతో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించినట్టు పట్టణ సీఐ వెంకటేష్ తెలిపారు.

## కెటిఆర్‌ను మర్యాద పూర్వకంగా కలిసిన ఏనుగు మనోహర్ రెడ్డి



వేములవాడ, జూన్ 27 (వాయిస్ టుడే) అసెంబ్లీ ఎలక్షన్ వేడి ఓ పక్క అందరిని ఆశ్చర్యం కలిగిస్తే, మంత్రి కేటీఆర్ ను బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి కలవడం, హాట్ టాపిక్ గా మారింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గనికి చెందిన బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి, హైదరాబాద్ సచివాలయంలో మంత్రి కేటీఆర్ ను, మర్యాద పూర్వకంగా కలిశారు. వేములవాడ బిఆర్ఎస్ టికెట్ పై ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో, మంత్రి కేటీఆర్ ను, ఏనుగు మనోహర్ రెడ్డి కలవడం హాట్ టాపిక్ గా మారింది.

## పోస్ట్ ఆఫీస్ పాలిసీ పరిహారం చెల్లింపు

వేములవాడ, జూన్ జూన్ 27 (వాయిస్ టుడే) వేములవాడ పట్టణం నివాసితుడు అయిన కాసారపు తిరుపతి గౌడ్ గత సంవత్సరం అక్టోబర్ నెలలో పోస్ట్ ఆఫీస్ ద్వారా రూపాయలు 399/- చెల్లించి టాటా గ్రూప్ ఆక్సిడెంట్ గార్డ్ ఆక్సిడెంటల్ పాలిసీ తీసుకున్నారు.ఏప్రిల్ నెలలో బైక్ పై వెలుతుండగా జారి పడి ప్రమాదానికి గురి అయ్యారు. ?399/- చెల్లించి తీసుకున్న టాటా పాలిసీ పరిహారం కోసం పోస్ట్ ఆఫీస్ ద్వారా క్లెయిమ్ చేసి రూపాయలు 65000/- పొందినారు. కేవలం 399/- చెల్లించి తీసుకున్న పాలిసీ ద్వారా 65000/- పరిహారం పొందడం ద్వారా తనకు ప్రమాద సమయంలో ఎంతో చేయూతను ఇచ్చిందని తిరుపతి గౌడ్ పేర్కొన్నారు.399/- చెల్లించి టాటా పాలిసీ తీసుకున్నచో 25000/- మొదలుకుని 1000000/- వరకు ఆసుపత్రి బిల్లులు , పాక్షిక అంగవైకల్యం , పూర్తి అంగవైకల్యం , మరణానంతరం నామినీకు పరిహారం అందేలా వెసులుబాటు ఉందని , ఈ పాలిసీ ను రాజన్న సిరిసిల్ల జిల్లా లోని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని జిల్లా పోస్టల్ అధికారి పెరుగు దయానంద్ పేర్కొన్నారు.



## మాజీ ఎంపీ సోలిపేట రామచంద్ర రెడ్డికి నివాళులర్పించిన దుబ్బాక శాసనసభ్యులు మాధవనేని రఘునందన్ రావు

దుబ్బాక( వాయిస్ టుడే) న్యూస్ జూన్ 27, సిద్దిపేట జిల్లా దుబ్బాక మండల పరిధిలోని చట్టాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీ సోలిపేట రామచంద్రారెడ్డి జూబ్లీహిల్స్ లోని మహా ప్రస్థానంలో అంతక్రియలో పాల్గొని రామచంద్ర రెడ్డి కి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు సోలిపేట రామచంద్ర రెడ్డి తన రాజకీయ జీవితం లో సర్పంచి స్థాయి నుంచి ఎమ్మెల్యేగా ఎంపీగా ప్రజా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన గ్రామం రేపటి తరానికి స్ఫూర్తిదాయకమని దుబ్బాక ప్రాంత వాసుగా రాజకీయ సామాజిక రంగంలో వారు ఆచరించిన కార్యాచరణ ప్రజా జీవితంలో కొనసాగుతున్న తమ లాంటి ఎందరో నేతలకు ప్రేరణగా నిలిచిందన్నారు. సోలిపేట రామ్ చంద్ర రెడ్డి మరణంతో తెలంగాణ మరో తొలి తరం ప్రజానేతను కోల్పోయిందన్నారు. వారి కుటుంబ సభ్యులకు దుబ్బాక శాసనసభ్యులు ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



## సిఐగా ప్రమోషన్ పొందిన దుబ్బాక ఎస్సై మహేందర్ సన్మానించిన బీఎస్పీ బండ నర్సింలు

దుబ్బాక (వాయిస్ టుడే) న్యూస్ జూన్ 27, సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో దుబ్బాక ఎస్సై మహేందర్ కు ప్రమోషన్ వచ్చిన సందర్భంగా బహుజన సమాజ్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు సూరంపల్లి ముత్యాల నర్సింలు దుబ్బాక మండలం అధ్యక్షులు సుద్దాల రాజు బహుజన సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బండ నర్సింలు మాట్లాడుతూ దుబ్బాక ఎస్సై మహేందర్ ను శాలువాతో సత్కరించి సూరంపల్లి ముత్యాల నరసింహులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బహుజన సమాజ్ పార్టీ దుబ్బాక గడ్డపై బహుజన్ సమాజ్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆయన అన్నారు. దుబ్బాక బహుజన సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బండ నర్సింలు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం బహుజన్ సమాజ్ పార్టీ ఒక ఓటు ఒక నోటు అనే సిద్ధాంతం బహుజన్ సమాజ్ పార్టీకే దక్కిందని దుబ్బాక మండలం ప్రధాన కార్యదర్శి బండ నర్సింలు అన్నారు.

## టీఎల్ఎఫ్ భవనాన్ని తిరిగి సమాఖ్యకే అప్పగించాలి

**మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి దేవేందర్ రెడ్డి**



జగిత్యాల(జూన్ 27,22)వాయిస్ టుడే : పట్టణ మహిళా సమాఖ్య సభ్యుల అభ్యున్నతి కోసం కేటాయించిన భవనాన్ని బాల రక్షక్ సదన్ కు కేటాయించడాన్ని నిరసిస్తూ జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేంద రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళా సమాఖ్యల కోసం కేటాయించిన టౌన్ లేవల్ ఫెడరేషన్ భవనాన్ని బాల రక్షక్ సదన్ కు కేటాయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తునట్లు పేర్కొన్నారు. టీఎల్ఎఫ్ ఏళ్ల తరబడి 60 సమాఖ్యలు, 60మంది అధ్యక్షురాళ్లు. 60 మంది రిసోర్స్ పర్సన్లు ప్రతినెలా 24న సమావేశం నిర్వహిస్తున్నారని వెల్లడించారు. బాల రక్షక్ సదన్ కు కేటాయిస్తున్నట్లు టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు అరుణకు సమాచారం ఇవ్వలేదని, కనీసం అధికార పార్టీ కౌన్సిలర్లకు కూడా సమాచారం ఇవ్వలేదని విజయలక్ష్మి వాపోయారు. ఇదేమిటని ప్రశ్నిస్తే కొన్ని నెలలు మాత్రమే తాత్కాలికంగా బాల రక్షక్ సదన్ కు కేటాయించినట్లు అధికారులు చెప్పడాన్ని ఆమె తప్పుబట్టారు. మహిళ సమాఖ్య భవనానికి సంబంధించి మున్సిపల్ కార్యాలయంలోగాని, సిబ్బందినిగాని అడిగినా సమాచారం ఇవ్వడం లేదన్నారు. అధికారుల తీరుతో సమాచారం ఇచ్చేందుకు భయబ్రాంతులకు గురవుతున్నారని అన్నారు. టీఎల్ఎఫ్ భవనం కేటాయింపు పై కాంగ్రెస్ కౌన్సిలర్లు వాకబు చేస్తే నాలుగేళ్లకు లీజుకు ఇచ్చారని, బాల రక్ష క్ సదన్ నిర్వాహకులు చెప్పారన్నారని అన్నారు. మహిళలకు సంబంధించిన కుట్టు మిషన్లు, జూట్ మిషన్లకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

# బాలానగర్‌లో ఇంటింటికి బిజెపి భరోసా పాదయాత్ర



కూకట్ పల్లిబీ జూన్ 27(వాయిస్ టుడే)బీ కూకట్ పల్లి నియోజకవర్గంలోని ఇంటింటికి బిజెపి భరోసా కార్యక్రమం గత 28 రోజులుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం బాలనగర్ డివిజన్ అధ్యక్షులు జి.ఆర్.రమేష్ ఆధ్వర్యంలో ఇంటింటికి బిజెపి భరోసా 9 వ రోజు కార్యక్రమానికి ముఖ్య నాయకులు, బీజేపి మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు పన్నాల హరిచంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తొమ్మిది సంవత్సరాల సుపరిపాలన కార్యక్రమంపై వారు వివరించారు. ప్రతి బూత్ లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. తదనంతరం మధ్యప్రదేశ్ లో జరిగినటువంటి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మేర బోత్ సబ్సే మజ్బూద్ హై కార్యక్రమాన్ని డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకట సేనా రెడ్డి ఇంట్లో నాయకులు కార్యకర్తలు అందరూ వీక్షించారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సిరెడ్డి, జిల్లా మాజీ కార్యదర్శి సురేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్తూరు రమేష్, బీజేవైఎం కార్యవర్గ సభ్యులు మధు, డివిజన్ ప్రధాన కార్యదర్శులు ఏ.లక్ష్మణ్, డి.వెంకట శేనారెడ్డి, మహిళా మోర్చా అధ్యక్షురాలు శివరంజని, ఓబీసీ మోర్చా అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ గౌడ్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు ఎడ్ల అనిల్ కుమార్, ఎస్టీ మోర్చా అధ్యక్షులు కోట్ల నాయక్, బీజేవైఎం నాయకులు పద్మారావు, సీనియర్ నాయకులు అశోక్, ఇంద్రసేన, బీజేవైఎం సమంత్ గౌడ్, సందీప్, డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.